ఇక అవిశ్వాస పర్వం!

- ప్రభుత్వ మార్పుతో రాజుకుంటున్న 'స్థానిక' రాజకీయం
- సొసైటీలు, స్థానిక సంస్థల అధ్యక్షులకు పదవుల గండం
- ప్రత్యర్థులపై అస్త్రాలు ఎక్కుపెడుతున్న 'అధికార' శ్రేణులు

ఖమ్మం, జనవరి 11(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీఆర్ఎస్ ఓటమి.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన నేతల్లో నామినేటెడ్, స్థానిక సంస్థల పదవులపై ఆశలు చిగురించాయి. దీంతో అధికార పార్టీ వైపు మొగ్గుచూపుతున్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చైర్మన్ పదవులకు గురిపెడుతూ అవిశ్వాస పర్వానికి తెరలేపుతున్నారు. సొసైటీల అధ్యక్షులపై అవిశ్వాస తీర్మానాలు చేస్తూ అధికారులకు లేఖలు అందిస్తున్నారు. అయితే అసెంబ్లీ ఎన్నికలకంటే ముందే కొందరు సొసైటీల అధ్యక్షులు, మండల పరిషత్ అధ్యక్షులు, మునిసిపల్‌చైర్మన్లు కాంగ్రెస్ గూటికి చేరగా.. ఎక్కువ శాతం మంది బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. కానీ ప్రభుత్వం మారడం, జిల్లాలో ఊహించని విధంగా భట్టి విక్రమార్క డిప్యూటీసీఎంగా, ఆర్థిక, విద్యుత్‌శాఖ ల మంత్రిగా, తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రిగా, పొంగులేటి శ్రీనివాసరెడ్డి రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రిగా పదవులు పొందారు. అసెంబ్లీలో ఘన విజయంతో జోష్‌లో ఉన్న కాంగ్రెస్.. రాబోయే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టింది. దీంతో ఇప్పటివరకు బీఆర్ఎస్‌లో ఉన్న స్థానిక సంస్థలు, సహకార సంఘాల పాలకవర్గాలను కాంగ్రెస్ గూటికి తెచ్చుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తోంది. అయితే కొందరు ఇప్పటికే స్వచ్ఛందంగా కాంగ్రెస్ గూటికి చేరగా.. మిగిలిన వారు కూడా తాము కాంగ్రెస్‌లో చేరికకు సిద్ధమని సంకేతాలు ఇస్తున్న నేపథ్యంలో.. అవిశ్వాసాలతో పదవులను తప్పించే ప్రక్రియ మొదలైంది. గురువారం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై.. ఆయన చైర్మన్‌గా ప్రాతినిధ్య వహిస్తున్న ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెం సొసైటీకి చెందిన 11డైరెక్టర్లు అవిశ్వాసనోటీసు ఇచ్చారు. నాగభూషయ్యను సొసైటీ చైర్మన్ పదవి నుంచి తొలగించాలంటూ.. మొత్తం 13మంది డైరెక్టర్లలో 11మంది జిల్లా సహకారశాఖ అధికారి విజయకుమారికి ఫిర్యాదు చేశారు. దీంతో 15రోజుల్లో ఆయనపై అవిశ్వాస సమావేశం పెట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో వారంతా అవిశ్వాసానికి కట్టుబడితే నాగభూషయ్య వీ వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షపదవితో పాటు డీసీసీబీ డైరెక్టర్, చైర్మన్ పదవులను కూడా కోల్పోనున్నారు. కాగా భద్రాద్రి జిల్లా దమ్మపేట సొసైటీ అధ్యక్షుడిపై కూడా డైరెక్టర్లు అవిశ్వాసానికి రంగం సిద్ధంచేస్తున్నారు. ఈ అవిశ్వాసాల పరంపర ఊపందుకుంటుందని ఈ క్రమంలోనే ఉమ్మడిజిల్లాలో ఖమ్మం కార్పొరేషన్, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం మునిసిపల్ పాలకవర్గాలు పలుచోట్ల మండలపరిషత్ అధ్యక్ష పదవులకు కూడా గండం ఏర్పడే అవకాశం కనిపిస్తోంది.

నాగభూషయ్యపై వీ.వెంకటాయపాలెం సొసైటీ సభ్యుల అవిశ్వాసం



ఖమ్మం డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై వీ.వెంకటాయపాలెం సొసైటీ డైరెక్టర్లు 11మంది ఇచ్చిన అవిశ్వాస నోటీసుతో రాజకీయం వేడెక్కింది. మొత్తం 13మంది డైరెక్టర్లుగాను 11మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకార అధికారి విజయకుమారికి గురువారం లేఖ అందించారు. సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న కూరాకుల నాగభూషయ్యపై తమకు విశ్వాసం లేదని, సభ్యులకు అందుబాటులో ఉండడంలేదని ఆయన సొసైటీ అధ్యక్షుడిగా ఉండడం భావ్యంకాదని భావించి అవిశ్వాసంపెట్టి పదవి నుంచి తొలిగించాలని నిర్ణయించుకున్నామని, తక్షణం అవిశ్వాస సమావేశానికి తేదీ నిర్ణయించాలని డీసీవోకు డైరెక్టర్లు ఫిర్యాదు చేశారు. సొసైటీలో ఉన్న 13మంది డైరెక్టర్లలో 11మంది నాగభూషయ్యకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వైపు ఉండడంతో నాగభూషయ్యను సొసైటీ అధ్యక్షుడిగా తొలిగించేందుకు డీసీవోకు



జిల్లా సహకార అధికారి విజయకుమారికి అవిశ్వాస పత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు

అవిశ్వాసం సమావేశం పెట్టాలని సంతకాలతో వినతిపత్రం అందించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఈ డీసీసీబీ చైర్మన్ పదవి ఎంతో కీలకమైందే కావడంతో ఆయనపై అవిశ్వాసం నెగ్గితే కాంగ్రెస్ నుంచి ఈ పదవి కోసం పోటీపడేవారు చాలామందే ఉన్నారని తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో నాగభూషయ్య పదవిని కోల్పోయే అవకాశాలే ఎక్కువ ఉన్న నేపథ్యంలో ఆయన అవిశ్వాసాన్ని ఎదుర్కొంటారా? లేదంటే ముందే రాజీనామా చేస్తారా? అన్నది చర్చనీయాంశమైంది. ఈ విషయంలో కాంగ్రెస్ వ్యూహాత్మకంగా పావులు కదిపింది. ఖమ్మం డీసీసీబీలో 19మంది డైరెక్టర్లకు ఓటుహక్కు ఉండగా ప్రస్తుతం కొన్ని డైరెక్టర్లు ఖాళీగా ఉన్నాయి. కూరాకుల కూడా సొసైటీ అధ్యక్ష పదవిని కోల్పోతే మరో డైరెక్టర్ కూడా ఖాళీ అవుతుంది. 17మందే ఓటుహక్కులో పాల్గొనే పరిస్థితి కనిపిస్తోంది. ఇక కొత్త డీసీసీబీ చైర్మన్ రేసులో కాంగ్రెస్ నేతలు తుళ్లూరు బ్రహ్మయ్య, బొర్ర రాజశేఖర్, అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, మేకలమల్లిబాబుయాదవ్, కోరం జానకీరావు, జనగం కోటేశ్వరరావు, నిర్మల పుల్లారావు పేర్లు వినిపిస్తున్నాయి.

15 పనిదినాల్లో అవిశ్వాస ప్రక్రియ పూర్తి
విజయకుమారి, జిల్లా సహకార అధికారి

వీ.వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్‌గా ఉన్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై ఆ సొసైటీలోని మొత్తం 13మంది డైరెక్టర్లలో 11మంది అవిశ్వాసం కోరుతూ లేఖ అందించారు. సహకార శాఖ సెక్షన్ 34ఏ ప్రకారం డైరెక్టర్లు ఆవిశ్వాసం కొరిన తర్వాత 15 పనిదినాల్లో అవిశ్వాస ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆమేరకు మేం ఈ ప్రక్రియను పూర్తి చేస్తాం. మొత్తం 13మంది డైరెక్టర్లకు నోటీసుల రూపంలో అందజేస్తాం. ఆ నోటీసులోనే ఆవిశ్వాస తేదీని ప్రకటిస్తాం. అవిశ్వాసానికి వచ్చిన వారి సంఖ్యను బట్టి నిర్ణయం తీసుకుంటాం.

'సీతారామా'తో పది లక్షల ఎకరాలకు నీరు

- ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించాం
- ఆర్థిక, సాంకేతిక సమస్యలను ప్రభుత్వ పరంగా పరిష్కరిస్తాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- యాతాలకుంట వద్ద టన్నెల్ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

సత్తుపల్లి, జనవరి 11: సీతారామా సాగునీటి ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, ఆ లక్ష్యంగా ప్రాజెక్టు పనులను సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఆయన సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద నిర్మిస్తున్న టన్నెల్ పనులను పరిశీలించి, అధకారులతో సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీతారామా ప్రాజెక్టు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించామని, ఈ క్రమంలో ఆర్థిక, సాంకేతిక సమస్యలేమైనా తలెత్తితే వెంటనే ప్రభుత్వం దృష్టికి తేవాలని, సీఎంతో మాట్లాడి సత్వరమే పరిష్కరిస్తామన్నారు. తొలుత సత్తుపల్లి ట్రంక్ పరిధిలోని సత్తుపల్లి మండలం యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయగలిగితే సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువుకు గోదావరి జలాలను మళ్లించి అక్కడి నుంచి ఎన్టీఆర్ కెనాల్ ద్వారా వేంసూరు మండలం, పెనుబల్లి మండలం లంకాసాగర్ ప్రాజెక్టులకు నీటిని మళ్లించవచ్చన్నారు. తద్వారా సత్తుపల్లి నియోజకవర్గం మొత్తం గోదావరి జలాలు పారుతాయన్నారు. ఇప్పటికే బూర్గంపాడు, కమలాపురం, పూసుగూడెం పంప్‌హౌస్‌లు పూర్తయ్యాయని, దమ్మపేట మండలం గండుగులపల్లి వద్ద పంప్‌హౌస్ నిర్మాణంలో ఉందని ఇది పూర్తయితే దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకూ సాగునీరు అందుతుందన్నారు. యాతాలకుంట టన్నెల్ వద్ద లూజ్ సాయిల్ కారణంగాపనులు వేగంగా జరగడం లేదని దీంతో రెండు వైపులా పనులు చేపట్టి పూర్తి చేయాలని సూచించామన్నారు. టన్నెల్ పనులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేస్తున్నారన్నారు. జూన్ కల్లా కట్టడాల పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

రూ.70కోట్లు విడుదలకు భట్టికి ఫోన్

సత్తుపల్లి మండలం యాతాలకుంట సమీపంలో సీతారామ పనులకు భూ సేకరణ అడ్డంకిగా మారిందని అధికారులు మంత్రి తుమ్మల దృష్టికి తెచ్చారు. దీంతో భూ సేకరణకు అవసరమైన నిధులు రూ.70కోట్ల విడుదలకు ఆర్థిక శాఖ అనుమతులివ్వాలని తుమ్మల డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు ఫోన్లో కోరారు. యాతాలకుంట టన్నెల్ పూర్తయితే మధిర నియోజకవర్గంలో బ్రాంచ్ కెనాల్ ద్వారా లక్ష ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉందని వివరించారు. దానికి భట్టి సానుకూలంగా స్పందించారు. తుమ్మల వెంట సీతారామాప్రాజెక్టు ఎస్ఈ ఎస్.శ్రీనివాసరెడ్డి, ఈఈలు సురేష్‌కుమార్, శ్రీనివాసాచారి, డీఈఈలు చంద్రశేఖర్, జి.మోతీలాల్, ఎల్.కృష్ణ, పి.చంద్రస్వామి, ఏఈలు నరసింహారావు, గఫూర్, కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ దయానంద్, తదితరులున్నారు.

94.41శాతం
దరఖాస్తులు ఆన్‌లైన్

- చివరిదశకు ప్రజాపాలన అర్జీల కంప్యూటీకరణ
- మరో రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి

కొత్తగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆరుగ్యారెంటీ పథకాల అమలు కోసం ప్రజలనుంచి స్వీకరించిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రక్రయ జిల్లాలో చివరి దశకు చేరుకుంది. గురువారం సాయంత్రం వరకు జిల్లావ్యాప్తంగా 94.41శాతం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీలు, 22 మండలాల్లో మొత్తం 3,33,225 దరఖాస్తులను ప్రజలను స్వీకరించారు. అయితే ఆ దరఖాస్తుల్లో ఇప్పటి వరకు జిల్లా యంత్రాంగం 3,14,583దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఇంకా 18,642 దరఖాస్తులను కంప్యూటీకరణ చేయాల్సి ఉంది. భద్రాచలం, అశ్వాపురం, మణుగూరు, కరకగూడెం, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో 100శాతం ఆన్‌లైన్ నమోదు పూర్తయ్యింది. టేకులపల్లి మండలంలో 99.08, దమ్మపేట 98.70, పాల్వంచ 98.30, లక్ష్మీదేవిపల్లి 97.54, సుజాతనగర్ 97.48, బూర్గంపాడు 97.28, ములకలపల్లి 96.98, ఇల్లెందు 95.25, గుండాల 93.31, జూలూరుపాడు 92.19, చుంచుపల్లి 90.19 పినపాక 89.95, దుమ్ముగూడెం 87.55, ఆళ్లపల్లి 85.75, అశ్వారావుపేట 82.19, చర్ల 81.19శాతం ఆన్‌లైన్ పూర్తయ్యింది. 22 మండలాల్లో 2,75,402 దరఖాస్తులకు గాను 2,60,001 దరఖాస్తులను ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేశారు. ఇంకా 15,401 దరఖాస్తులు పూర్తి చేయాల్సి ఉంది. మణుగూరు మున్సిపాలిటీలోనూ 100శాతం ఆన్‌లైన్ పూర్తయ్యింది. పాల్వంచ మున్సిపాలిటీ 98.07, కొత్తగూడెం 94.81, ఇల్లెందు 81.53శాతం ఆన్‌లైన్ జరిగింది. మున్సిపాలిటీల పరిధిలో 57,823 దరఖాస్తులు రాగా 54,582దరఖాస్తులను ఆన్‌లైన్‌లో కంప్యూటరీకరణ చేశారు. 3,241దరఖాస్తులను ఇంకా చేయాల్సి ఉంది. మున్సిపాలిటీ పరిధిలో 94.31శాతం పూర్తయ్యింది. జిల్లా వ్యాప్తంగా ఇంకా 18,642దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఇవి కూడా ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఇల్లెందు మునిసిపాలిటీకి
ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ 11వ ర్యాంకు

ఇల్లెందు టౌన్, జనవరి 11: స్వచ్ఛసర్వేక్షన్ స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇల్లెందు మునిసిపాలిటీకి జాతీయస్థాయి ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ 11వ ర్యాంకును కేంద్ర ప్రభుత్వ ప్రకటించింది. ఈ మేరకు గురువారం రాత్రి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి జిల్లాలో కేవలం ఇల్లెందు మున్సిపాలిటీకే 11వ ర్యాంకు రావడంతో మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. మున్సిపాల్టీలో చేపట్టిన స్వచ్ఛభారత్, స్వచ్ఛసర్వేక్షన్‌లో ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేయడం వల్లనే 11వ ర్యాంకు దక్కిందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు.

అంబులెన్స్‌లకు
చమురు భారం!

- రిఫర్ కేసుల్లో పేదలతోనే డీజిల్ ఖర్చు పెట్టిస్తున్న వైనం
- ఆచరణలో నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



గిఫ్ట్ ఏ స్మైల్ వాహనాలు

అంబులెన్స్‌లు.. ప్రమాదాలు, ఇతర ఏకారణాలతోనైనా అత్యవర వైద్యం అవసరమైన వారిని సత్వరమే ఆస్పత్రికి తరలించి సరైన సమయంలో వైద్యం అందించడమే లక్ష్యంగా కుయ్‌కుయ్ మంటూ పరుగులు పెడుతుంటాయి. అలాంటి అంబులెన్స్‌ల నిర్వహణ కష్టతరంగా మారింది. ముఖ్యంగా గిఫ్ట్ ఏ స్మైల్ కింద సమకూర్చిన వాహనాల లక్ష్యమైతే ఆచరణలో నీరుగారుతోంది. ఈ అంబులెన్స్‌లు కొన్ని చోట్ల రోగులకు ఉపయోగపడక పోగా అత్యవసర పరిస్థితుల్లో రోగుల కుటుంబాలకే భారంగా మారుతోంది. ఖమ్మం ఇల్లా ఆసుపత్రి నుంచి రోగులను వరంగల్, హైదరాబాద్ గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు రిఫర్ చేసినప్పుడు అంబులెన్స్‌ల డీజిల్ ఖర్చులను రోగుల తరపువారి నుంచే వసూలు చేస్తున్నారు. ఒక్కో సారి రూ.2500 నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో 108 వాహనాలు 16 ఉండగా.. భద్రాద్రి కొత్తగూడెంలో 21 ఉన్నాయి. ఇక ఖమ్మం జిల్లాలో గిఫ్ట్ ఏ స్మైల్ కింద దాతలు ఇచ్చిన వాహనాలు 6ఉండగా.. భద్రాద్రి జిల్లాకు 5అంబులెన్స్‌లు సమకూరాయి.

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 11 : నిత్యం ఖమ్మం జిల్లా ఆస్పత్రికి వచ్చే రోగుల్లో కనీసం ఒకటి నుంచి ముగ్గురికి మెరుగైన వైద్యం అసవరమంటూ హైదరాబాద్, వరంగల్‌లోని ఉస్మానియా, గాంధీ, ఎంజీఎం తదితర ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. అలా రిఫర్ చేసిన రోగులను తరలించేందుకు జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న గిఫ్ట్ ఏ స్మైల్ అంబులెన్స్‌ను అందుబాటులో ఉన్నాయి. కానీ రోగులను తరలించేందుకు మాత్రం డీజిల్ ఖర్చును ప్రభుత్వం కాకుండా రోగులే భరించాలన్న నిబంధనలను అమలుచేస్తున్నారు. దీంతో పేదలపై డీజిల్ భారం పడుతోంది. అసలే ప్రైవేటు వైద్యం భరించలేని పేదలు ప్రభుత్వ ఆస్పత్రికి వస్తుంటే.. అత్యవసర సమయంలో వారికి ఉచితంగా అందించాల్సిన అంబులెన్స్ సేవలకు డీజిల్ ఖర్చు పేరుతో డబ్బు వసూలు చేస్తుండడం రోగుల కుటుంబాలకు ఆవేదన మిగులుతోంది.

ఉమ్మడి జిల్లాలో వాహనాలు ఇలా..

ఆస్పత్రుల్లో రోగులకు సేవలందించాలన్న మహదాశయంతో కొందరు ప్రముఖులు అంబులెన్స్‌లను విరాళంగా ఇచ్చారు. వాటిని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ (108)కు అప్పగించినా వాటిని స్థానికంగా ఉన్న ఆస్పత్రులకు కేటాయించారు. ఖమ్మం జిల్లాలో కూసుమంచి వాహనానికి మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, వైరాలో వాహనానికి అక్కడి ఎన్నారై, మధిర బనిగెళ్లపాడు, కల్లూరు మండలాల్లో ఉన్న వాహనానికి ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, ఖమ్మంలోని వాహనానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గిఫ్ట్ ఏస్మైల్ కింద వాహనాలను అందించారు. భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, చంద్రుగొండ మండలాలకు బెంగళూరుకు చెందిన కొందరు, దమ్మపేట వాహనాన్ని ఖమ్మం ఎంపీ నామ, చర్ల వాహనానికి అప్పటి కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు చెందిన స్నేహితుడు, ముల్కలపల్లికి మరో వ్యక్తి అంబులెన్స్‌లను అందజేశారు. ఇవన్నీ ఆయా ఆసుపత్రుల పరిధిలో ఉంటున్నా ఈ వాహనాలు కదలాలంటే పేదలు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది.

ప్రజల నుంచి వసూలు..

ఏరియా ఆస్పత్రులకు వచ్చే కేసుల్లో హైరిస్క్ కేసులను జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు రిఫర్ చేస్తుంటారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో లివర్, న్యూరో, కిడ్నీ, ప్రమాద బాధితులను నిపుణుల కొరత పేరుతో రిఫర్ చేస్తుంటారు. నెలలో కనీసం 20 నుంచి 25కేసులను పంపుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు డ్రైవర్లు డీజిల్ ఖర్చులే కాకుండా అదనంగా కూడా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ వెళ్లాలంటే రూ.2వేలు, హైదరాబాద్ వెళ్లాలంటే రూ.4వేల నుంచి రూ.5వేలు వసూలు చేస్తున్నట్టు విమర్శలున్నాయి. గిఫ్ట్ ఏ స్మైల్ కింద ఇచ్చిన అంబులెన్స్‌ల నిర్వహణ వ్యయాన్ని స్థానిక ఆస్పత్రులు భరించడం లేదు. ప్రభుత్వం నుంచి కూడా నిధులు రాకపోవడంతో అంబులెన్స్‌లను తప్పని సరిగా వాడాల్సి వచ్చినప్పుడు సంబంధిత రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఇలా అంబులెన్స్‌ల నిర్వహణ వ్యయాన్ని రోగులపై బలవంతంగా రుద్దడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాదు జిల్లా ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న పార్థీవ వాహనం కూడా పేదలకు సమకూర్చాలంటే డ్రైవర్లు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన రోగి మృతదేహాన్ని వారి ఇంటి వరకు ఉచితంగా పంపించాల్సిన పార్థివ వాహనాన్ని పంపడానికి మీనమేశాలు లెక్కిస్తున్నారన్నారు. పుట్టెడు దుఃఖంలో ఉన్నా ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారని రోగుల కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా పేద రోగుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని డీజిల్ ఖర్చును ప్రభుత్వం భరించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పట్టభద్రులు..
ఓటు నమోదు చేసుకోవాలి

- ఫిబ్రవరి 6వరకు దరఖాస్తుకు అవకాశం
- గతంలో ఓటు కలిగినవారూ మళ్లీ దరఖాస్తు చేయాలి
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ప్రియాంక అల



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల

కొత్తగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదుకు పట్టభద్రులు దరఖాస్తులు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కు నమోదుపై ఐడీఓసీ కార్యాలయంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటరు నమోదు దరఖాస్తులు స్వీకరణ, పరిష్కారంలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. ఓటరు నమోదు గురించి ఓటర్లకు సహాయ రిటర్నింగ్ అధికారులు, డిసిగ్నేటెడ్ అధికారులు, సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతివారం నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ఓటరు జాబితా రూపకల్పనపై వివరించాలన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి అర్హులైన పట్టభద్రులు ఫాం-18లో ఫిబ్రవరి 6లోగా దరఖాస్తు చేయాలని, ఫిబ్రవరి 24న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తామని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటన తదుపరి ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, మార్చి 29 వరకు వచ్చిన అన్ని క్లైమ్స్ పరిష్కరించి, ఏప్రిల్ 4న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామన్నారు. ఓటు కోసం దరఖాస్తు చేసుకునే పట్టభద్రులు 2020 నవంబరు 2 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను డిజిగ్నేటెడ్ అధికారి, గెజిటెడ్ అధికారులచే ధ్రువీకరణతో దరఖాస్తు చేయాలని తెలిపారు. చిరునామా ధ్రువీకరణ కోసం ఓటరు నమోదు ఫారంతో పాటు ఎపిక్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలు జతపర్చాలని, పట్టభద్రుల నూతన ఓటరు జాబితా తయారు చేస్తున్నందున గతంలో ఓటు హక్కు కలిగి ఉన్న పట్టభద్రులు సైతం తిరిగి నూతనంగా దరఖాస్తు చేయాలని తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో అవగాహన కల్పించాలని, ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికన ఓటరు జాబితా రూపకల్పన ఎన్నికల సంఘం నిబంధనలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ రాంబాబు, డీఆర్వో రవీంద్రనాథ్, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



హాజరైన అధికారులు

నెలాఖరు వరకు సీఎంఆర్ మిల్లింగ్ పూర్తి చేయాలి

నెలాఖరు వరకు సీఎంఆర్ మిల్లింగ్ పక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఐడీవోసీ సమావేశ మందిరంలో గురువారం సీఎంఆర్ మిల్లింగ్ పక్రియపై పౌర సరఫరాల అధికారులు, సంస్థ మేనేజర్, మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు మిల్లర్లకు కేటాయించి లక్ష్యం మేర సీఎంఆర్ మిల్లింగ్ పక్రియ పూర్తి చేయాలన్నారు. సీఎంఆర్ పక్రియపై పౌరసరఫరాల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని, జాప్యానికి తావు లేకుండా మిల్లింగ్ పక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ ఉన్న మిల్లర్ల నుంచి త్వరితగతిన మిల్లింగ్ పక్రియ పూర్తి చేసేందుకు ఇతర మిల్లులకు కేటాయింపు చేయాలని పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, పౌర సరఫరాల అధికారి రుక్మిణి దేవి, పౌర సరఫరాల సంస్థ మేనేజరు త్రినాథబాబు, పౌర సరఫరాల శాఖ నాయబ్ తహసీల్దార్లు, మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు జుగల్ కిషోర్, కార్యదర్శి రాజేందర్, కోశాధికారి ఆనంద్, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు భద్రాద్రిలో కూడార్రై ఉత్సవం

కుటుంబంతో రామయ్యను దర్శించుకున్న ఐటీడీఏ పీవో



కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్

భద్రాచలం, జనవరి 11: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నివేదన సమయంలో తిరుప్పావై, తిరుపళ్లెచ్చి అనే ద్రవిడ ప్రబంధాలను పఠిస్తారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుడితో తన వివాహం జరిగితే 108గంగాళాలతో పాయసాన్నం(అక్కారడిశలు) నివేదన చేస్తానని సుందర బాహుస్వామికి మొక్కుకుంటారు. ఈ క్రమంలో ప్రతి ఏటా ధనుర్మాసం 27వ రోజున కూడార్రై ఉత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. ఈ సందర్భంగా 108గంగాళాలతో స్వామివారికి పాయసాన్నం నివేదన చేస్తారు. ఈ ఉత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు రూ.150 చెల్లించి స్వామివారి ప్రసాదం స్వీకరించాలని ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. అలాగే ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ కుటుంబ సమేతంగా రామచంద్రస్వామిని దర్శించుకోగా.. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

నూతన గనులతోనే సింగరేణికి భవిష్యత్తు

- కేంద్ర ప్రభుత్వ టెండర్లలో సింగరేణి పాల్గొనాలి
- కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయిస్తాం
- త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ
- 'ఆంధ్రజ్యోతి'తో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం

కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఇల్లెందు, జనవరి 11: 'కార్మికుల కోసం, సంస్థ మనుగడ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బొగ్గు గనుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనాలి తెలంగాణలోని నాలుగు నూతన గనులు సాధించాలని' సింగరేణి కాలరీస్ గుర్తింపు కార్మిక సంఘం నేత, ఏఐటీయూసీ కేంద్ర కమిటీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య స్పష్టం చేశారు. సింగరేణి ఎన్నికల్లో యూనియన్ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఇల్లెందు వచ్చిన ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తమ యూనియన్ భవిష్యత్ కార్యక్రమాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఏం చేయబోతున్నారు.

వాసిరెడ్డి: సింగరేణి సంస్థ భ విష్యత్తుతోనే కార్మికుల సంక్షేమం ముడిపడి ఉంది. సింగరేణి మనుగడ సాధించాలంటే కొత్త గనులు ఏర్పాటు కావాలి

ఆంధ్రజ్యోతి: కొత్త గనులు ఏర్పాటు జరుగుతుందా?

వాసిరెడ్డి: పార్లమెంట్‌లో ఆమోదించిన ఎంఎండీఆర్ చట్టం ప్రకారం నూతన బొగ్గు గనుల కేటాయిపులు వేలం ద్వారానే జరుగుతున్నాయి. అందువల్ల సింగరేణి సంస్థ, సైతం తెలంగాణ రాష్ట్రంలోని సత్తుపల్లి-3 వబ్లాక్, కైరిగూడలోని ఓసీ-3 బ్లాక్, తాడిచెర్ల రెండో బ్లాక్, శ్రావణపల్లి కోయగూడెం ఓసీ బ్లాక్‌ల సాధన కోసం టెండర్లలో పాల్గొనాలి. అనుమతులు సాధించాలి

ఆంధ్రజ్యోతి: గత 10 ఏళ్లలో కొత్త గనులు ఎందుకు సాధించలేకపోయారు ?

వాసిరెడ్డి: రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కనుసన్నల్లో సింగరేణి ఉన్నతాధికారులు పనిచేశారు. గత సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం వైఫల్యంతో సంస్థ పరిస్థితులు, పార్లమెంట్ చట్టాలపై అవగాహన లేమి, టెండర్ల ప్రక్రియలో రాజకీయంగా మితిమీరిన జోక్యంతో పాల్గొనలేకపోవడంతో నూతన గనులు రాలేదు. తాము నూతన గనుల సాధన కోసం టెండర్లు దాఖలు చేయాలని కోరుతున్నాం. లేకుంటే గనుల ఏర్పాటు సాధ్యం కాదు.

ఆంధ్రజ్యోతి: కార్మికుల సొంత ఇంటి పథకం అమలు సాధ్యమేనా ?

వాసిరెడ్డి: ప్రాణాలు ఫణంగా పెడుతూ బొగ్గు ఉత్పత్తులు సాగిస్తూ లాభాలు తెచ్చి పెడుతూ సిరులు కురిపిస్తున్న కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయా ల్సిందే. సింగరేణి వ్యాప్తంగా ఖాళీగా ఉన్న స్థలాల్లో గనులు తవ్వ కాలు పూర్తి చేసిన ఏరియాల్లో వేలాది ఎకరాల భూము లు క్వార్టర్లు ఖాళీగా ఉన్నాయి. సింగరేణి స్థలాలు కబ్జాలకు గురౌతున్నాయి. గతంలో అధికారంలో ఉన్న నేతలు సింగరేణి స్థలాలను కబ్జా చేశారు. ఆ స్థలాలను కార్మికులకు, పదవీ విరమణ చేసిన రిటైర్డు కార్మికులకు కేటాయించాలి. ప్రభుత్వతోడ్పాటుతో వాటిల్లో కార్మికులకు సొంత గృహాలు నిర్మించవచ్చు.

ఆంధ్రజ్యోతి: సింగరేణి ప్రాంతాల్లో వందలాది క్వార్టర్లు కేటాయింపులు లేక శిథిలమౌతున్నాయి. ఎందుకు పట్టించుకోవడం లేదు?

వాసిరెడ్డి : ఔను నిజమే గనులు మూత, కార్మికుల బదిలీ వలంల అనేక ఏరియాల్లో వందలాది క్వార్టర్లు వృథాగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని రిటైర్డు సర్వీసులోని కార్మికులకు కేటాయిస్తే సొంత ఇంటి పథకం కార్యరూపం దాలుస్తుంది. నామ మాత్ర ధరలు ఖరారు చేసినా వాటిని తీసుకునేందుకు సర్వీసులోని, రిటైర్డు కార్మికులు ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారు. అందువలన సింగరేణికి ఆదాయంతో పాటు నిర్వహణ భారం ఉండదు. మిగులు క్వార్టర్లు, ఖాళీ స్థలాలపై యాజమాన్యంతో ప్రభుత్వంతో చర్చిస్తాం

ఆంధ్రజ్యోతి: సింగరేణికి ప్రభుత్వ సంస్థల బకాయిలు గుదిబండలా మారాయి. ఎలా వసూలు చేయగలుగుతారు ?

వాసిరెడ్డి: ప్రభుత్వ సంస్థలు జెన్కో, ట్రాన్స్‌కోలు సింగరేణికి రూ 25 వేల కోట్లు బకాయి పడ్డాయి. సంస్థలో ఆర్థిపరమైన సమస్యలు తీరాలంటే బకాయిలు రాబట్టాలి. త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని గుర్తింపు కార్మికసంఘం ప్రతినిధుల వర్గం స్వయంగా కలవనుంది. ఈ సందర్భంగా సింగరేణి బకాయిలు చెల్లింపు అంశాలు, కార్మికుల సొంత ఇంటి పథకం, నూతన గనుల సాధన కోసం టెండరు దాఖలు చేయడం రిటైర్డు కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం లాంటి అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయబోతున్నాం

ఆంధ్రజ్యోతి: గుర్తింపు సంఘం సింగరేణియాజమాన్యం నడుమ ఎలాటి సంబంధాలు ఉండబోతున్నాయి.?

వాసిరెడ్డి: మాది గతంలో మాదిరాగా పైరవీల సంఘం కాదు. అందరూ నిబంధనలు పాటించాలి. కనుమరుగైన జేసీసీ. స్ట్రక్చరల్ సమావేశాలు జరిపిస్తాం, ప్రతి ఆరు నెల లకు జేసీసీ సమావేశం ప్రతి నాలుగు నెలలకు స్ట్రక్చరల్ సమావేశాలు, రెండు నెలలకోసారి డైరెక్టర్లతో ప్రతి మూడు నెలలకోసారి సీఅండ్ఎండీతో సమావే శాలను జరిపిస్తాం కార్మిక సమస్యలు చర్చిస్తాం.. పరిష్కరిస్తాం..

అటవీ అధికారుల విధులకు ఆటంకం: నిందితుడికి రిమాండ్

టేకులపల్లి, జనవరి 11: అటవీ అధికారుల విధులకు ఆటంకం కలిగించి, ఇసుకలోడు ట్రాక్టర్‌తో వారి వాహనా నికి నష్టం చేకూర్చిన కేసులో లక్ష్మీదేవిపల్లి మండలం రాం దాసుతండాకు చెందిన నూనవత్ హతీరామ్‌ను గురువా రం అరెస్టు చేసినట్టు టేకులపల్లి ఎస్సై రమణారెడ్డి తెలిపా రు. ఎస్సై రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం అక్రమ ఇసుక తోలకాలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఫారెస్టు అధికారులు ఈనెల 9న ఇల్లెందు-కొత్తగూడెం ప్ర ధాన రహదారిపై సాయన్నపేట సమీపంలో వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో టేకులపల్లి వైపు నుంచి నూనావతు హతీరామ్ తన ట్రాక్టర్‌లో అక్రమ ఇసుకలోడుతో వెళ్లుతుండగా ట్రాక్టర్ అధికారులు అడ్డగిం చారు. దీంతో అటవీ అధికారుల విధులకు ఆటంకం కలి గించి, వారి వాహనానికి ట్రాక్టర్‌తో తగిలించడంతో ధ్వంస మైంది నిందితుడిని గురువారం రిమాండ్ చేసి కోర్టుకు తరలించారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి: కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 11: 'మీరంతా భవిష్యత్తు వైద్యులు.. ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో మీవంతు పాత్రను పోషించాల'ని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథిగా హాజరైన కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ ప్రైవేటు వైద్య కళాశాలలో ఒక్కో సీటుకి కనీసం రూ కోటిన్నర నుంచి రెండు కోట్ల రూపాయల ఖర్చయ్యేదని కానీ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను అతి దగ్గర గా తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ క ళాశాలలో ఈ ఐదేళ్లలో కేవలం ఐదు లక్షల రూపాయల ఖర్చుతో వైద్యసీటు కల్పించిందన్నారు. ఖమ్మం మెడికల్ కళాశాల మంజూరి అయిన తర్వాత పాత కలెక్టరేట్ భవనాన్ని మీకు కేటాయించినట్లు తెలిపారు. ఎంతో మంది కలెక్టర్లు ఈ ప్రాంగణంలో పనిచేసి ఎదిగారని వారిని స్ఫూర్తిగా తీసుకుని ఈ ప్రాంగణంలో మీరు మంచి వైద్యులుగా ఎదగాలని కోరారు. తొలుత కళాశాల పరిస్థితిపై ప్రగతిపై ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు వివరించారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఫ్రెషర్స్ డే సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు కలెక్టర్ వీపీ గౌతమ్, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్‌సురభి బహుమతులను అందచేశారు. ఆ తర్వాత విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సరిత, డాక్టర్ సదానందం, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, డిప్యూటీ సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి వెంకటేశ్వర్లు, ఆర్ఎంవోలు డాక్టర్ బి రాంబాబు, డాక్టర్ అమర్‌సింగ్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఓటర్ల జాబితా సమగ్రంగా ఉండాలి

ఖమ్మం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

జూలూరుపాడులో ఫారం-6, 8 దరఖాస్తుల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న సత్యప్రసాద్

జూలూరుపాడు, జనవరి11: పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్ల జాబితాను సమగ్రంగా రూపొందించాలని ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్, వైరా నియోజ కవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్ సూచించారు. గురువారం జూలూరు పాడులోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి కొత్త ఓట్ల నమో దు, ఫామ్-6, ఫామ్-8 కింద వచ్చిన దరఖాస్తుల వివరా లను తహసీల్దార్ శారదను అడిగి తెలుసుకు న్నారు. బీఎ ల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ గ్రామాలలో చనిపోయిన, గ్రామంలో లేని ఓటర్లను జాబితా నుం చి తొలిగించాలని, తప్పు లు లే కుండా ఓటర్ల జాబితా ను రూపొం దించాలని అ న్నారు. బీఎ ల్‌వోలు గ్రామా లలో పర్యటించి వివరాలను సే కరించి ఆన్ లైన్‌లో నమో దు చేయాలని తెలిపారు. 22 నాటికి అన్ని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమా న్ని పూర్తి చేయాలని కోరా రు. 18 సం వత్సరాలు నిం డిన వా రంద రిని కొత్త ఓటర్లుగా నమోదు చేయాలని అన్నారు. బీఎల్ వోలు అదనపు కలెక్టర్‌ను కలిసి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాము 8 వేలకుపైగా ఖర్చు పె ట్టినప్పటికి త మకు రూ.1350లు మాత్రమే ఇచ్చారని తెలిపారు. సమ స్యను పరిష్కరిస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, డిప్యూటీ తహసీల్దార్ గౌతమ్, ఆర్ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడికి ఎన్ఆర్ఐల చేయూత

రఘునాథపాలెం, జనవరి11: తమ సోదరి విధులు నిర్వ హిస్తున్న ప్రభుత్వ బడికి ఏదైనా సహాయం అందించాలని ఆ ఎన్ఆర్ఐలు భావించారు. అనుకున్నదే తడవుగా ప్రభు త్వ బడికి చేయూత అందించారు. భవిష్యత్‌లోనూ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రఘు నాథపాలెం మండలం కోయచెలక ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న దేవిశెట్టి సరస్వతి సోదరులు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. సోదరిపై ఉన్న ప్రేమతో ఆమె పనిచేస్తున్న ప్రభుత్వ బడికి సహా యం అందించాలని తలిచారు. గురువారం కోయచెలక ప్ర భుత్వ పాఠశాలకు రూ.10 వేల క్రీడాపరికరాలను అంద జేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ రామకృష్ణ మాట్లాడు తూ విద్యార్థుల విద్యా సౌకర్యాల కోసం మరో రూ.3లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. పాఠశాలలో మౌళిక వసతు లను కల్పించేందుకు తమ వంతు పాత్ర పోషి స్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శిరీష, ఎన్ఆర్ఐలు రామకృష్ణ, నత్య, లేశ పాల్గొన్నారు.



క్రీడా పరికరాలు, ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐలు

'కాంగ్రెస్ పార్టీ కోసం త్యాగాలు చేశాం'



దీపాదాస్ మున్షీకి తను పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని వివరిస్తున్న జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ రవి

ఇల్లెందు, జనవరి 11: 'ఇల్లెందు నియోజకవర్గంలో కాం గ్రెస్ పార్టీని బీఆర్ఎస్ నాయకుల బెదిరింపుల నుంచి కా పాడుకున్నాం. కేడర్‌తో పాటు పార్టీని అభివృద్ధి చేశాం. అసెంబ్లీ ఎన్నికల్లో సమీకరణాల కారణాలు చూపి పార్టీ టికెట్ ఇవ్వలేదు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూ బాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని' జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ డాక్టర్ జి. రవి సీడబ్ల్యూసీ సభ్యురాలు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీ పాదాస్ మున్షీ, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ మహే శ్‌కుమార్ గౌడ్‌ను కోరారు. గురువారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో కాంగ్రెస్ నేతలను కలిసిన డాక్టర్ రవి ఇల్లెందు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కోసం చేసిన కృషిని, పార్టీ ఆరు గ్యారెంటీల పథకాలను చేసిన ప్రచారాలను పార్టీ గె లుపు కోసం చేసిన తీరును వివరించారు. ఈ సంద ర్భంగా దీపాదాస్ మున్షి, మహేష్ కుమార్ గౌడ్‌లు అసెం బ్లీ ఎన్నికల తరుణంలో పార్టీ నిర్వహించన సర్వేల్లో డాక్టర్ రవి ప్రథమ స్థానంలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారని ఆయన వెల్లడించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల తరుణంలో వివిధ సమీకరణాల కారణం గా టికెట్ ఇవ్వలేకపోయామని, లోక్‌సభ అభ్యర్థిత్వా ల్లో పరిశీలిస్తామని, ఏఐసీసీకి నివేదిస్తామని సీడబ్ల్యూసీ నేత లు హామీ ఇచ్చినట్లు రవి పేర్కొన్నారు.

సత్తుపల్లిలో ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

మరో ఉపాధ్యాయుడిపై క్రమశిక్షణ చర్య, ఉత్తర్వులు జారీ చేసిన డీఈవో

సత్తుపల్లి, జనవరి11: సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని పాత సెంటర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిత్తలూరి ప్రసాదును సస్పెండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ఉత్తర్వులు జారీ చేశారు. సత్తుపల్లి పట్టణంలోని పాతసెంటర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలను గత నెల18న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి సందర్శించారు. ఈసమయంలో పాఠశాలలో పిల్లలు లేకపోవటాన్ని గమనించారు. విద్యార్థులు ఎందుకు రాలేదని ప్రశ్నించగా విద్యార్థులు క్రిందటి రోజు ఆదివారం పిక్‌నిక్‌కు వెళ్లారని, మరుసటి రోజు పాఠశాలకు రాలేదని ప్రధానోపాధ్యాయుడు చిత్తలూరి ప్రసాదు బదులిచ్చారు. అనుమతి లేకుండా పాఠశాలకు సెలవు ఎలా ఇస్తారని అంటూ ఏఈవోకు ఫోన్ చేశారు. సెలవు ఇవ్వటానికి తాను అనుమతి ఇవ్వలేదని సమాధానమిచ్చారు. దీంతో ఈనెల 2న డీఈవో సోమశేఖర శర్మ విచారణ జరిపారు. ఈ మేరకు హెచ్ఎం చిత్తలూరి ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ విషయాన్ని ఎంఈవో రాములు ధృవీకరించారు.

హైస్కూల్ టీచర్‌పై క్రమశిక్షణ చర్య

సత్తుపల్లిలోని పాతసెంటర్ జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు వేము రత్నాకర్‌పై జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ క్రమశిక్షణ చర్య తీసుకున్నారు. పాఠశాలలో వేము రత్నాకర్ ప్రవర్తనపై పలు ఫిర్యాదులు అందటంతో విచారణ జరిపారు. అనంతరం క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఆయనను తల్లాడ మండలం కుర్నవల్లికి డిప్యుటేషన్ ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ట్రాక్టర్‌పై నుంచి జారిపడి బాలుడికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, జనవరి11: మండలంలోని పాపకొల్లు పంచాయతీ పరిధిలోని భీమ్లాతండా గ్రామానికి చెందిన రెండున్నర ఏళ్ళ బాలుడు గుగులోత్ రిషి ట్రాక్టర్ పై నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి నాగరాజు తన కుమారుడు రిషిని ట్రాక్టర్‌పై కూర్చోబెట్టుకొని ఇంటి సమీపంలో నడుపుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బాలుడు ట్రాక్టర్‌పై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్సలు అందించేందుకు ఖమ్మం తరలించారు.

కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం: ఏజీఎం

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 11: సింగరేణి కార్మికుల వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు ఏజీఎం శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో కారుణ్య నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ వారసుల ధృవీకరణ పత్రాలను పరిశీలించారు.త్వరలోనే నియామకపత్రాలను అందచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీఎంవో డాక్టర్ విక్టర్ వందనం, డీజీఎం సివిల్ రాజశేఖర్, పర్సనల్ మేనేజరు సుశీల్‌కుమార్, ఎస్సీలు నరేంద్రకుమార్, రవికుమార్, అధికారులు శైలజ, సాయి సప్లన్ తదితరులు పాల్గొన్నారు.

రైలుకిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



మధిర, జనవరి 11: మధిర-మోటమర్రి రైల్వేస్టేషన్ల మధ్య వైరా నదిపైవున్న రైల్వే బిడ్జి సమీపంలో గురువారం గుర్తుతెలియని యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. గురువారం మధ్యాహ్నాం 2గంటల సమయంలో 25ఏళ్ల యువకుడు ఎగువలైన్‌పై వెళుతున్న గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు సాయంత్రం సంఘటనా స్థలం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇతడి నుంచి ఎలాంటి గుర్తింపు కార్డు లభించలేదు. మృతదేహాన్ని మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించి మార్చూరిలో భద్రపర్చారు.

అనారోగ్యంతో యువకుడి మృతి

చర్ల, జనవరి 11: చర్ల మండలం కందిపాడు గ్రామానికి చెందిన ఎం, రవికుమార్ (18) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన రవికుమార్ డిగ్రీ పూర్తి చేశాడు. ప్రస్తుతానికి ఇంట్లోనే ఉంటున్నాడు. కాగా కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు, జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు చర్ల, భద్రాచలంలోని వైద్యశాలలతో వైద్యం అందించారు. ఇదేక్రమంలో గురువారం ఇంట్లో మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. కందిపాడు గ్రామంలో విశాద ఛాయలు అలుముకున్నాయి.

అక్రమ నిర్మాణాల తొలగింపు



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

ఖమ్మంకార్పొరేషన్,జనవరి11: నగరంలోని ఖానాపురం ఊరచెరువు వద్ద అక్రమంగా నిర్మించిన గదులను, షెడ్లను నగరపాలకసంస్థ అధికారులు గురువారం తొలగించారు. చెరువు శిఖం భూమిని ఆక్రమించి కొందరు ఇక్కడ నిర్మాణాలు చేపట్టారు. కాగా సదరు నిర్మాణాలకు అనుమతి లేదని నగర పాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు పేర్కొన్నారు. నగర పాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఆక్రమణలను కూల్చి వేశారు. కాగా బల్లేపల్లి సర్వేనెంబర్లను చూపించి, ఖానాపురం చెరువుశిఖంలో నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కాగా ఖమ్మం ఎమ్మెల్యే, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అక్రమ నిర్మాణాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించటంతో, నగరపాలకసంస్థ, రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలపై దృష్టి పెట్టారు. ఆ మేరకు నగరపాలకసంస్థ అధికారులు ఖానాపురం చెరువు వద్ద నిర్మించిన నిర్మాణాలను కూల్చివేశారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు కలప స్వాధీనం

ఇల్లెందురూరల్, జనవరి11: గుండాల మండలం నుంచి బోలోరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను గురువారం తెల్లవారు జామున అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్ననాయక్ ఆధ్వర్యంలో ఇల్లెందు మండలం సుదిమళ్ల స్టేజి వద్ద సుమారు రెండు లక్షల విలువైన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. ఇల్లెందు పట్టణం సత్యానారాయణపురం చెందిన మీరా, వినమ్ గుండాల మండలం ఎల్లాపురం అడవుల్లో నుంచి కలపను తరలిస్తున్నరనే సమాచారం మేరకు ఇల్లెందు మండలం సుదిమళ్ల స్టేజి వద్ద కలపను స్వాధీనం చేసుకోని, ఇద్దరి అరెస్టు చేశారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

బూర్గంపాడు, జనవరి 11: బూర్గంపాడు మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం శివారులో గురు వారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఎస్ఐ రాజ్‌కుమార్ దాడులు నిర్వహించారు. ముగ్గురు జూదురులు, రూ.4వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రెడ్డిపాలెం గ్రామా నికి చెందిన 13మంది, సారపాకకు చెందిన ముగ్గురు పారిపోయారని చెప్పారు.

పాల్వంచ: మండల పరిధిలోని నాగారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసు లు దాడి చేశారు. నలుగురి అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి రూ.7300 నగదు, నాలుగు సె ల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

సారా విక్రేతకు రూ.75 వేల జరిమానా

జూలూరుపాడు, జనవరి11: మండలంలోని కాకర్ల పంచాయతీ పరిధిలోని దుబ్బతండా గ్రామానికి చెందిన గుగులోత్ గోవింద్ సారాను విక్రయిస్తూ దొరికాడు. తహసీల్దార్ కోర్టులో హాజరు పరచగా సదరు వ్యక్తికి తహసీల్దార్ శారద రూ. 75 వేలు జరిమానా విధించినట్లు కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ జయశ్రీ గురువారం తెలిపారు. సదరు వ్యక్తి గతంలో సారాను విక్రయించడంతో కేసు నమోదు చేశామన్నారు.

మహిళా పోలీసుస్టేషన్‌లో అత్తా కోడళ్ల ఘర్షణ

ఖమ్మంక్రైం, జనవరి11: భార్యభర్తలు గొడవ విషయమై ఏకంగా మహిళ పోలీసు స్టేషన్‌లోనే అత్తా, కోడళ్లు ఘర్షణకు దిగారు. ఈ సంఘటన గురువారం ఖమ్మం నగరంలో జరిగింది. నగరానికి చెందిన ఓ యువతికి పాల్వంచ పోలీసస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న యువకుడికి కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరి వీరు కొంతకాలం వరకు సజావుగానే ఉన్నారు. కాగా ఇటీవల వీరిమధ్య గొడవలు జరుగుతుండడంతో సదరు యువతి ఖమ్మం మహిళ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మహిళ పోలీసుస్టేషన్ అధికారులు గురువారం భర్త తల్లితోపాటు సదరు యువతికి, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్ అనంతరం తిరిగి 16వతేదీన మరోసారి కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని చెప్పి పంపించివేశారు. కౌన్సెలింగ్ ముగించుకుని బయటకు వస్తుండగా స్టేషన్‌లో అత్తాకోడలికి మాటలతో వివాదం జరిగింది. దీంతో ఇరువురు ఘర్షణకు పాల్పడ్డారు అది గమనించిన మహిళ పోలీసు స్టేషన్‌సిబ్బంది వారి వద్దకు వెళ్లి సముదాయించారు. వారిని అక్కడినుంచి పంపించి వేశారు. కాగా మహిళ పోలీసుస్టేషన్‌లోనే గొడవ చేయడంతో అత్తా, కోడళ్లపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మహిళ పోలీసుస్టేషన్ అధికారి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బూర్గంపాడు, జనవరి11: బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక శివారులోని గోదావరి నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం ఎస్ఐ రాజ్‌కుమార్ స్వాధీనం చేసుకున్నారు. ఐటీసీకి అధిక లోడుతో కర్రను తరలిస్తున్న ట్రాక్టర్‌పై భద్రాచలం ఎంవీఐ తిరుపతి కేసు నమోదు చేశారు.

15 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, జనవరి11: ఒరిస్సా రాష్ట్రం నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు మోటారు సైకిళ్లపై తరలిస్తున్న ఎండు గంజాయిని గురువారం భద్రాచలం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రహీమున్నీసా బేగం వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారం మేరకు అధికారులు కూనవరం రోడ్‌లోని ఆర్టీఓ ఆఫీస్ ఎదురుగా తనిఖీలు నిర్వహించారు. రెండు ద్విచక్ర వాహనాలపై ఇద్దరు 15కేజీల ఎండు గంజాయితో వెళుతుండగా అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. హైదరాబాదులో అమ్మేందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఎండు గంజాయిన రవాణా చేస్తున్న ఒడిస్సా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా, దుహనాపేట్, పాపులర్ గ్రామానికి చెందిన తున్‌కందర్‌ఖిల, అదేరాష్ట్రానికి చెందిన కురమనార్, చిత్రకొండ గ్రామానికి చెందిన పాటి.ఖిలను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రహీమున్నీసా బేగం తెలిపారు. ఈ తనిఖీలలో అలీమ్, బాబు, లలిత, నరేందర్, నీలవేణి పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల అవసరం మేరకు రహదారి

అశ్వారావుపేట, జనవరి 11: అశ్వా రావుపేట పట్టణం భద్రాచలం రోడ్డులో మూడోకిలోమీటరు వద్ద నుంచి లోపలకు వేసిన గ్రావెల్ రోడ్డును పామాయిల్ రైతుల వినతి మేరకు ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రహదారి నిర్మించామనిటీఎస్ ఆయిల్ ఫెడ్ రైతుసంఘ కార్యదర్శి శీమకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. గురు వారం రైతుల కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మించిన గ్రావెల్ రోడ్డు ఎవరో ఒకరిద్దరికోసం నిర్మించా రనే ప్రచారం సరికాదన్నారు. ఈ ప్ర దేశంలో దాదాపుగా 200 ఎకరాల్లో పామాయిల్ తోటలు ఉన్నాయని, రైతుల వినతి మేరకు ఈ రహదారిని నిర్మించామన్నారు. సమావేశంలో పామాయిల్ రైతులు గుండు రాదా స్వామి, పీవి రామారావు, ఆరేపల్లి చంద్రశేఖర్, ముమాడి బలరామ రాజు, దశరథం, సొలస పుష్కరం, శ్రీనివాసరావు, ప్రసాద్, దేవత గజా నన తదితరులు ఉన్నారు.

గుట్టమల్లారంలో స్థలవివాదం

మణుగూరుటౌన్, జనవరి11: మణుగూరు మండలంలోని గుట్టమల్లారం ప్రాంతంలో మంగళవారం ప్రధాన రహదారికి ఆనుకున్న ఉన్న స్థల వివాదం విషయం తెలిసిందే. కాగా ఈ విషయమై స్థానిక సర్పంచ్ ముత్తయ్య తనపై దాడికి పాల్ప డ్డాడని, తమ స్థలంలో వేసిన కంచెను స్థానిక సర్పంచ్‌తో పాటు మరికొందరు కలసి తొలగించారంటూ స్థానికుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. వివాద స్థలం వద్దకు ఎస్ఐ రాజేష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోలీస్ సిబ్బందితో కలిసి వెళ్లి స్థానికంగా ఉన్న గ్రామస్తులను విచారించారు. ఇరువురి తరఫు వారిని విచారించి వారి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. సర్పంచ్ స్వయంగా కంచే తొలగించే పనులకు పూనుకో వడమేంటని ప్రశ్నలు గుప్పిస్తున్నారు. ఆ స్థలంలో ఏనాటి నుంచో గ్రామస్తుల కోసం నిర్మించిన బావిఉందని, ఇదీ ప్రభుత్వ స్థలమేనంటూ స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఇరువర్గాలు కోర్టులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది.



అయ్యారే అరిసెలు.. భళారే సకినాలు



పండుగ అంటేనే సందడి..అందులోనూ తెలుగు ప్రజలు అత్యంత ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. ఇక సంక్రాంతిని మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకుంటున్నా.. పండుగ వాతావరణం మాత్రం వారం ముందు నుంచే ప్రారంభమవుతుంది. పండుగల్లో ఏ పండగకు ప్రత్యేకమైన వంటకాలు లేకున్నా.. సంక్రాంతికి మాత్రం ప్రత్యేకమైన వంటకాలు ఉంటాయి. పండుగ వేళ కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కమ్మని పిండి వంటకాలను ఆరగించి సంతోషంగా గడుపుతారు. ఈనేపథ్యంలోనే ప్రాంతాలను బట్టి పండుగకు రకరకాల పిండి వంటలు తయారు చేసుకుంటారు. అందరూ అరిసెలను వండుకోవటం ఆనవాయితీ కాగా వాటితో పాటు సకినాలు, చెకోడీలు, గారెలు, లడ్డూలు ఇలా రకరకాల వంటలను తయారు చేసుకోవటం పరిపాటి. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా పేద, ధనికులు ఇలా అన్ని వర్గాల ప్రజలు తమ స్థాయిని మించి కూడా వంటలు చేసుకుంటారు. కొత్త పంటలు రావటంతో రైతులు కూడా ఆనందంతో పండుగను జరుపుకుంటారు.

-అశ్వారావుపేట రూరల్

» ఇంటింటా పిండి వంటల ఘుమఘుమలు

» సంక్రాంతి నేపథ్యంలో మహిళలు బిజీబిజీ



అశ్వారావుపేటలో అరిసెలు వండుతున్న మహిళలు

సామూహికంగా పిండి వంటల తయారీ

మామూలు పండుగకు వంటలు చేసుకోవాలంటే ఇంట్లో వారే తయారు చేసుకుంటారు. కానీ సంక్రాంతి పండుగకు పిండి వంటలు తయారు చేయాలంటే మాత్రం కనీసం నాలుగురైదుగురు ఉండాలి. ప్రధానంగా అరిసెలు, ఇతర వంటలు చేయాలంటే మహిళలు ఒకరి సహకారం ఒకరు తీసుకుంటూ వంటలు వండుకుంటారు. అరిసెలు, లడ్డూలు తయారు చేయటానికి ఇరుగు పొరుగు మహిళల సహకారం తీసుకుంటూ సరదగా కబుర్లు చెప్పుకుంటూ పిండి వంటలను పూర్తి చేస్తారు. వండిన వంటలు కనీసం పక్షం రోజులు తినేలా వండుకుంటారు. వంటల సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో సందడి సందడి నెలకొంటుంది. వారం ముందు నుంచే రోజూ ఒకరి ఇంట్లో వంటలు వండటం చేపడతారు.

పిండి మిల్లులకు గిరాకి

పిండి వంటలకు ప్రధానంగా కావాల్సింది బియ్యం పిండి. అరిసెలు, గారెలు, సకినాలతో పాటు ఇతర వంటలకు బియ్యం పిండి అవసరం. ఇందులోనూ తడి, పొడి బియ్యంను ఆడించి పిండి వంటలను వండుతారు. బియ్యం, పచ్చిశనగపప్పును ఆడించి పిండి వంటలు తయారు చేస్తారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం పిండి మిల్లుల వద్ద ఖాళీ లేకుండా ఉంది. పట్టణాల్లో పలు ప్రాంతాల్లో పిండి మిల్లులు ఉంటాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఒకటి రెండుకి మించి పిండిని ఆడించే మిల్లులు ఉండవు. దీంతో ప్రస్తుతం మిల్లులకు గిరాకి నెలకొంది.

పెరిగిన ధరలతో ఇబ్బందులు

కొంతకాలంగా నిత్యావసర ధరలు పేదోడికి చుక్కలను చూపెడుతున్నాయి. అయినా పండుగ నేపథ్యంలో వంటలు తప్పనిసరిగా చేసుకోవాలి కాబట్టి భారం అయినా తప్పటం లేదు. ప్రస్తుతం ఇంట్లో మూకుడు పెట్టాలంటే కనీసం రూ.వెయ్యి లేనిది ఏ వంట చేయలేని పరిస్థితి. ఒకస్థాయిలో వంటలు చేయాలంటే కనీసం రూ.2వేల నుంచి రూ.4వేల వరకు అవుతున్నాయి. ప్రస్తుతం నూనె ధర రూ.100 నుంచి రూ.170 వరకు ఉంది. శనగపిండి రూ.90, శనగపప్పు రూ.90, నువ్వులు రూ.220, బెల్లం రూ.60 ఇలా వంటలకు వాడే సరుకుల ధరలు గణనీయంగా పెరిగాయి. ధరలు పెరిగినా ఏమాత్రం వెరవకుండా పండుగ ఆనవాయితీని పోనియకుండా ప్రతి ఇంటా తమకు ఇష్టమైన వంటలను చేసుకుంటున్నారు.

కలిసి చేసుకుంటే ఆనందం
తానంకి నాగమణి



సంక్రాంతి పండుగ సందర్భంగా అందరం కలిసి వంటలు చేసుకోవటం జరుగుతుంది. వంటలు చేసుకుంటుంటే కలిగే ఆనందమే వేరు. సరదగా కబుర్లు చెప్పుకుంటూ వంటలు చేస్తుంటే అలసట ఉండదు. వంటల్లో పరస్పర సహకారం తప్పనిసరిగా ఉండాలి.

నాలుగైదు రోజులు పడుతుంది..
తిరుమలశెట్టి స్వప్న



సంక్రాంతి పిండి వంటలు అంటే కనీసం ఐదు రోజుల పాటు వండాలి. రోజుకొకరి ఇంట్లో నాలుగైదుగురు కలిసి అన్ని రకాల వంటలు వండుతున్నాము. ఒకరికి ఒకరు సాయం చేయకపోతే సంక్రాంతికి వంటలు వండుకునే అవకాశమే ఉండదు. అందరం కలిసి పిండి వంటలు చేయటం ఎంతో సరదగా , కష్టం అనేదే లేకుండా ఉంటుంది.







అశ్వారావుపేట ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థినీ,విద్యార్థులు, ముగ్గులు వేస్తున్న చిన్నారులు, జూలూరుపాడులో పతంగులు ఎగరేస్తున్న దృశ్యం

విద్యాలయాల్లో
ముందస్తుగా సంక్రాంతి వేడుకలు

పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో గురువారం పలు చోట్ల ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. భోగి మంటలు వేసి విద్యార్థులు సందడి చేశారు. పతంగులు ఎగరేసి కేరింతలు కొట్టారు. పాఠశాలలను రంగవల్లులతో అలంకరించారు. సంప్రదాయ దుస్తులతో అలరించారు. -నెట్‌వర్క్

బస్టాండ్లలో సంక్రాంతి రద్దీ

బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు









సొంతూళ్లకు వెళ్తున్న విద్యార్థులు, ప్రయాణికులతో ఖమ్మం నగర బస్టాండ్ కిటకిట, తల్లితో కలిసి స్వగ్రామానికి వెళ్తున్న విద్యార్థిని, ఇంటికి పయనమైన ఓ యువతి

ఖమ్మం ఖానాపురంహవేలి జనవరి 11: సంక్రాతి పండుగకు సొంతూళ్లకు నగర వాసులు తరలివెళ్తున్నారు. దీనికి తోడు విద్యాసంస్థలకు వరుస సెలవులు ఇవ్వడంతో విద్యార్థులు స్వగ్రామాలకు పయనమయ్యారు దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు బస్ డిపోల పరిదిలోని అన్ని బస్టాండ్‌లలో ప్రయాణికులతో కళకళలాడాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో నెట్టుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినా ప్రయాణికులకు సరిపడాలేవని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించటంతో ఆ ఏడాది ప్రయాణికులు పెరిగారని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. గురువారం నగరంలోని నూతన బస్టాండ్, సిటీ బస్టాండ్‌లలో ప్రయాణికులతో రద్దీగా మారాయి. ఖమ్మం హైదరాబాద్, సూర్యాపేట, కోదాడ, సత్తుపల్లి, మధిర, ఇల్లెందు మహబూబాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు అధికంగా వెళ్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతాలకు అదనపు బస్సులను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రయాణికుల భద్రతకు పోలీసులు ప్రత్యేకంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. బస్టాండ్‌లలో ప్రత్యేక పోలీస్ ఔట్ పోస్టులు ఏర్పాటు చేశారు.

విద్యాసంస్థలకు సంక్రాంతి సెలవులు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు శుక్రవారం నుంచి 17 వరకు సెలవులు ప్రకటించింది. తిరిగి విద్యాసంస్థలు 18న ప్రారంభంకానున్నాయి. ఇంటర్ కళాశాలలకు శనివారం నుంచి 16 వరకు సెలవులు ప్రకటించింది. సెలవుల సమయంలో తరగతులు నిర్వహించవద్దని, ఎవ్వరైనా తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యా శాఖ హెచ్చరించింది. పండుగ సెలవులు ప్రకటించటంతో ఇరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు గురువారం మధ్యాహ్నం నుంచే ఇళ్లకు పయనమయ్యారు.

వైరా మునిసిపాలిటీ అవిశ్వాసం కంచికే?!



వైరా, జనవరి 11: రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌పై అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో కనుమరుగయ్యాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో జైపాల్‌ను చైర్మన్ పదవి నుంచి దించేందుకు 16మంది కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. అయితే జైపాల్ హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. మునిసిపాలిటీలో మొత్తం 20మంది కౌన్సిలర్లు ఉన్నారు. వారిలో 15మంది బీఆర్ఎస్ నుంచి, ఇద్దరు కాంగ్రెస్, ఇద్దరు స్వతంత్రులు, ఒకరు సీపీఎం నుంచి కౌన్సిలర్లుగా ఎన్నికయ్యారు. సీపీఎం నుంచి ఎన్నికైన కౌన్సిలర్ పార్టీతో విభేదించి బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే స్వతంత్ర కౌన్సిలర్లు కూడా బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటి అధికార పార్టీ కౌన్సిలర్ల సంఖ్య 18కి చేరింది. అయితే 2023 ఫిబ్రవరిలో మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్ అధినాయకత్వంపై తిరుగుబాటు చేయడంతో మునిసిపల్ చైర్మన్ జైపాల్ ఆయనకు మద్దతు తెలిపారు. అదే అదునుగా భావించి పదోవార్డులో ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు కూల్చివేతకు జైపాల్‌ను బాధ్యుణ్ని చేస్తూ కేసు నమోదుచేశారు. అరెస్టు కాకుండా జైపాల్ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ఎలాగైనా జైపాల్‌ను చైర్మన్ పదవి నుంచి దించేందుకు అప్పుడు ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి మొత్తం 16మంది కౌన్సిలర్లు ఆయనపై అవినీతి ఆరోపణలు చేస్తూ అవిశ్వాస తీర్మాన ప్రతిపాదన నోటీసును జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ఆవెంటనే జైపాల్ హైకోర్టును ఆశ్రయించి స్టే పొందారు. ఆసమయంలో జైపాల్ వెంట బీఆర్ఎస్‌కు చెందిన 7,8,20వ వార్డుల కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. అప్పటి కాంగ్రెస్ కౌన్సిలర్లు బత్తుల గీత, గుడిపూడి సురేష్ సహా 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఉన్నారు. హైకోర్టు నుంచి స్టే ఉండటంతో జైపాల్‌ను కదిలించలేకపోయారు. గత ఏడాది డిసెంబరు 30న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికలకంటే ముందే బీఆర్ఎస్‌కు చెందిన 9,10,19వార్డు కౌన్సిలర్లు సూర్యదేవర వింధ్యారాణి, కర్నాటి నందిని, ఇమ్మడి రామారావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. ఫలితంగా కాంగ్రెస్ బలం ఏడుకు చేరింది. అంతేకాకుండా ప్రస్తుతం బీఆర్ఎస్‌లోనే ఉన్నప్పటికీ నలుగురైదుగురు కౌన్సిలర్లు లోపాయికారీగా చైర్మన్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారు.

డోలు బాజా

» చర్ల అటవీగ్రామాల్లో ప్రతీ ఇంట్లో డోలు

» స్వయంగా తయారు చేసుకుంటుంటున్న ఆదివాసీలు

» ప్రతీ రోజూ డప్పులతో నృత్యాలు



డోళ్లతో ఆదివాసీలు

చర్ల, జనవరి 11: మండల కేంద్రాల్లో నివాసం ఉండే ప్రతీ ఇంట్లో టీవీ, మోటార్ సైకిల్ ఉంటే చాలా గొప్పగా భావిస్తారు. అదే అటవీగ్రామాల్లో ఉండే ఆదివాసీలు మాత్రం టీవీ, మోటార్ సైకిల్ లేకున్నా ప్రతీ ఇంట్లో డోలు ఉండాలని కోరుకుంటారు. డోలు ఉంటే అదో హోదాగా భావించి, స్వయంగా తయారు చేసుకుంటున్నారు, డోలు తయారీ అయ్యాక వారికి అవకాశం దొరికిన ప్రతీ రోజూ గ్రామాల్లో నృత్యాలు చేస్తున్నారు. ప్రస్తుతం చర్ల మండలంలోని ఉన్న 20 వసల ఆదివాసీ గ్రామాల్లో ఇవే దృశ్యాలు కనిపిస్తున్నాయి. ఇంటి ముందుకు వెళితే భారీ ఆకారంలో తయారు చేసిన డోళ్లు కనిపిస్తున్నాయి. కాగా ఆదివాసీలు అందరూ కలిసి అడవిలో వెళ్లి, భారీ చెట్లను సేకరించి తరువాత డోళ్ల తయారీ చేస్తామని, ఒక్కో డోలు సుమారు 25 రోజులు పడుతుందని ఆయా గిరిజన గ్రామాల ఆదివాసీలు చెబుతున్నారు. తయారీ చేసిన డోళ్లతో పండుగలకు పబ్బాలకు, మంచి జరిగినా, చెడు జరిగిన వాటిని వినియోగించి నృత్యాలు చేస్తామని ఆదివాసీలు చెబుతున్నారు. గురువారం చర్ల మండలం కందిపాడు గ్రామంలో ఆదివాసీల ఇళ్ల ముందు ఉన్న డోల్లను 'ఆంధ్రజ్యోతి ' కెమెరాలో బంధించింది.



కందిపాడు గ్రామంలో ఇళ్ల ముందు ఉన్న డోళ్లు

యువత.. ఇదేం నడత?

» చిన్న చిన్న విషయాలకే ఉద్వేగం » చెడు వ్యసనాలకు లోనవుతున్న తీరు

» ఏకాగ్రతతోనే లక్ష్య సాధన .. నేడు జాతీయ యువజన దినోత్సవం

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 11: స్వామి వివేకానంద పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది 128 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగోలో జరిగిన సర్వమత మహాసభ. ఈ సభలో ఆంగ్లంలో ఆయన చేసిన అనితరసాధ్యమైన ప్రసంగం నేటికీ స్ఫూర్తి పాఠం. ముందుగా తయారు చేసిన ప్రసంగపాఠం కూడా లేకుండా 'అమెరికా దేశపు ప్రియ సహోదరులారా' అంటూ ఆయన ప్రసంగం మొదలుపెట్టినప్పుడు మూడు నిమిషాల పాటు ఆగకుండా చప్పట్లతో మహాసభ దద్దరిల్లిపోయిన ఘట్టం చిరస్మరణీయం. ఆంగ్ల భాషలో ఆయన చేసిన ప్రసంగానికి అమెరికా ప్రజానీకం నీరాజనాలు పట్టింది. నేడు ఆ మహనీయుడి జయంతి. బలమే జీవం.. బలహీనతే మరణం అని చాటిన వివేకానందుడి జయంతి రోజున జాతీయ యువజనోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. ఉక్కు నరాలు, ఇనుప కండరాలు, ఉడుకు నెత్తురు కలిగిన యువతను ఇస్తే ఈ దేశపు రూపురేఖలు మారుస్తానని నాడు వివేకానందుడు చెప్పాడు. మరి ఆ తీరుగా ఉమ్మడి జిల్లా యువత ఉన్నారా అంటే ఒక్కసారి ఆలోచించుకోవాల్సి వస్తోంది.


వ్యసనాలకు బానిసలవుతున్నారు

కొత్త కొత్త ఆలోచనలు, కొత్త కొత్త ప్రయోగాలతో తమలోని నిగూఢ శక్తిని బయటకు తీసి ప్రపంచానికి దిశ, దశలను నిర్దేశించే యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. చదువుకునే రోజుల దగ్గర్నుంచే యువత సరైన మార్గాన్ని ఎంచుకుంటే వారిని ఆపే శక్తి ఎవరికీ ఉండదు. కానీ నేడు దానికి విరుద్ధంగా యువత మంచి కన్నా చెడును ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. పాఠశాల, కళాశాల దశల నుంచే గంజాయి, డ్రగ్స్ బారిన పడుతున్నారు. దీంతో కొంత మంది యువత మానసిక స్థితిని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు లక్ష మందికై పైగా యువతీ, యువకులు ఉన్నారు. ఉడుకు నెత్తురు, ఇనుప కండరాలు, దృఢ సంకల్పంతో ముందడుగు వేయాల్సిన యువత.. చిన్న చిన్న విషయాలకే ఉద్వేగానికి గురవుతున్నారు. కళాశాలలో గొడవ లు పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటున్న సంఘటనలు ఇటీవల పెరిగాయి. మరికొంతమంది బహిరంగంగా రోడ్లపై కర్రలతో దాడులు చేసుకుంటున్నారు. ఇటీవల నగర పరిధిలో గంజాయి బ్యాచ్‌లు సైతం విపరీతమయ్యాయి. నగర శివార్లలో గంజాయి అమ్మే వారి వద్ద యువత క్యూ క డుతుండటం విశేషం. ఆపై విచక్షణ కోల్పోయి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతున్నారు. పోలీసులు దృష్టిసారిస్తే ఇటువంటి వాటికి అడ్డుకట్ట పడుతుంది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి
దేవకి వాసుదేవరావు, వివేకానందా ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సెలెన్సీ వ్యవస్థాపకులు



యువతదే భవిత. యువత ప్రస్తుత టెక్నాలజీని అందిపుచ్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే ప్రపంచం అభివృద్ధి చెందుతుంది. స్వామీ వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ చెడు వైపు పయనిం చకుండా, వ్యసనాల బారీన పడకుండా దేశాభివృద్ధికి పాటు పడాలి. చెడు వ్యసనాలను జీవితంలో దగ్గరికి రాకుండా మంచి నడవడికను అలవరుచుకుంటే అదే జీవిత పరమార్థం.



అంతర్జాతీయస్థాయి బ్యాడ్మింటన్
అంపైర్‌గా మల్లికార్జున్

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 11: ఈనెల 16 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో జరగనున్న ఇండియన్ ఓపెన్ అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు గానూ జిల్లాకు చెందిన తుప్పతి మల్లికార్జున్ అంపైర్‌గా ఎన్నికైనారు. ఈ మేరకు బ్యాడ్మింటన్ అ సోసియేషన్ ఆఫ్ ఇండియా నియామక ఉత్తర్వులను జారీ చేసింది. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన మల్లికార్జున్ 2015 లో గ్రేడ్ 2 రిఫరీగా, 2019లో గ్రేడ్ 1 రిఫరీగా నియ మితులయ్యారు. అనంతరం పలు రాష్ట్రాలలో జరిగిన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు రిఫరీగా వ్యవహరించారు. ప్రస్తుతం ఇండియా ఓపెన్ ఇంటర్నేషల్ బ్యాడ్మింటన్ పోటీలకు రాష్ట్రం నుంచి ఇద్దరిని ఎంపైర్లుగా ఎంపిక చేయగా వారిలో ఒకరు మల్లికార్జున్ కావడం విశేషం. ఈ సందర్భంగా అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపైర్‌గా ఎన్నికైన మల్లిఖార్జున్‌ను తనికెళ్ల గ్రామసులతో పాటు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తమ్మినేని వెంకట్రావు, ఉప్పల్‌రెడ్డి, రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు ఏసీపీ వెంకట్రావు, సంఘ సభ్యులు డాక్టర్ సత్యనారాయణమూర్తి, రఘు, రమణ, రామారావు, శ్రీనివాస్ అభినందించారు.

ఈసారి ఆన్‌లైన్‌లోనే ప్రదర్శనలు

ఇన్‌స్పైర్ మనక్ నమూనాల అప్‌లోడ్‌కు గడువు ఈనెల18



ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 11: పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల ఆలోచనలకు పదునుపెట్టి భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మం త్రిత్వ శాఖ ఏటా 'ఇన్‌స్పైర్ మనక్' పోటీలు నిర్వహిస్తోంది. 2022-23 ఏడాదికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ఆలోచనలను ఎం పిక చేసి విద్యార్థుల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున జమ చే శారు. ఇక జిల్లా స్థాయిలో వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చే యాల్సి ఉంది. గత నవంబరులో పోటీలు జరగాల్సి ఉండగా ఎన్నికల నేపథ్యంలో వాయిదా పడ్డాయి. సమయాభావం వల్ల ఈ సారి ఆన్‌లైన్‌లో ప్రదర్శన ఇవ్వాలని ఆదేశాలు అందాయి. ఈ నెల 18లోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమూనాలు నిక్షిప్తం చేయాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్.. ఈ నెల 2 నుంచి 18 వరకు యాప్‌లో ప్రాజెక్టు వివరాల నమోదు. 19 నుంచి 25 వరకు మూ ల్యాంకనం. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలకు యాప్‌లో అప్‌లోడ్ చేయడం. ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు మూల్యాంకనం. అనంతరం జాతీయ స్థాయి జాబితా విడుదల.

రూ.10 వేల చొప్పున ఖాతాల్లో జమ

వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొనేందుకు ఏటా ఉమ్మడి జిల్లా విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో నూతన ఆవిష్కరణలు రూపొందిస్తున్నారు. పరిశోధన నమూనాకు అవసరమైన సామగ్రి ఇతర అవసరాల కోసం రూ.10 వేలు విద్యార్థి ఖాతాలో జమయ్యాయి. ఈ డబ్బుతో పరిశోధన నమూనాలు తయారు చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.

ముగ్గురు న్యాయ నిర్ణేతలు

ఆన్‌లైన్ పోటీల్లో ఉత్తమ పరిశోధనల ఎంపికకు ముగ్గురు సభ్యుల బృందం పర్యవేక్షిస్తుంది. జాతీయ ఆవిష్కరణ సంస్థ(నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్) నుంచి ఒకరు, జిల్లాకు చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. నిర్దేశిత తేదీల్లో ముగ్గురు ఆన్‌లైన్‌లోనే పరిశోధనలు పరిశీలిస్తారు. ప్రతి నమూనాకు పది చొప్పున మార్కులుండగా ప్రతిభ ఆధారంగా కేటాయించనున్నారు. ప్రతి జిల్లాలో ఎంపికైన నమూనాల్లో పది శాతం మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేయాల్సి ఉంటుంది.

కొవిడ్ తర్వాత మళ్లీ ఆన్‌లైన్‌లో..

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఆలోచనలను ఎంపిక చేసి జిల్లాలకు పంపారు. కొవిడ్ కారణంగా రెండేళ్ల కిందట ఆన్‌లైన్‌లో ప్రదర్శనలు ఏర్పాటు చేయగా మళ్లీ ఈసారి అదే విధానం కొనసాగుతోంది. ఒక్కో విద్యార్థికి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. విద్యార్థి సమగ్ర వివరాలతో యాప్‌లో లాగిన్ కావాలి. ప్రాజెక్టు వీడియో, ఆడియో, ఫొటో లను నిక్షిప్తం చేయాలి. వీడియో నిడివి 2 నిమిషాలు, డాటా 30 ఎంబీ దాటకూడదు. మరోసారి అన్ని వివరాలను సరిచూసుకుని అప్‌లోడ్ చేసుకోవాలి.

సాంకేతిక సందేహాల నివృత్తి
సోమశేఖర శర్మ, ఖమ్మం, డీఈవో



ఇన్‌స్పైర్ మనక్‌లో ఎంపికైన విద్యార్థుల నమూనాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించాం. ఎంఈవోలు, ప్రధానోపాధ్యా యులు సమన్వయం చేసుకొని నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. సాంకేతిక సమస్యలపై అనుమానాలుంటే నివృత్తి చేస్తాం.

రాజ్యాంగ మౌళిక విలువలను మరుస్తున్న కేంద్రం

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 11: భారత రాజ్యాంగంలో మౌళిక విలువలను కేంద్రం మరుస్తోందని, దీంతో పౌరుల హక్కులకు భంగం వాటిల్లుతుందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు విమర్శించారు. రాజ్యాంగ పరిరక్షణకై ప్రతి పౌరుడు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో నిర్వహించిన కేవీపీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని అన్ని మతాలు సమాఖ్య స్ఫూర్తితోనే పనిచేస్తున్నాయన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే దేవుడ్ని అధికార యంత్రాంగంలోకి తీసుకువచ్చిందని ఆరోపించా రు. దీంతో రాజకీయంగా లబ్ధి పొందేందుకు బీజేపీ మతతత్వ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలను అమ్మకాలకు పెట్టారని ఆరోపించారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. రాముడి పేరుతో రాజకీయాలు చేయడం ఏంటని ప్రశ్నించారు. మత రాజకీయాల వల్ల దేశం అన్ని రంగాల్లో వెనుకపడి పోతోందని ఆరోపించారు. మత రాజకీయాలు దేశానికి మంచివి కాదన్నారు. దేశాభివృద్ధికి పాలకులు పాటుపడాలన్నారు. కానీ మత రాజకీయాలతో రెచ్చగొడుతున్నారన్నారు. ఫిబ్రవరి 10, 11 తేదీల్లో కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సమా వేశాలు ఖమ్మంలో ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు ముతమల్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మనోహర్, మాచర్ల భారతి, కొమ్ము శ్రీను, పాపిట్ల సత్యనారాయణ, బోట్ల సాగర్, మట్టి దుర్గాప్రసాద్, కుక్కల సైదులు, నకిరికంటి చిరంజీవి పాల్గొన్నారు.

సత్తాచూపిన దమ్మపేట గిరిజన గురుకుల విద్యార్థులు



దమ్మపేట, జనవరి 11: జనవరి 8,9,10వ తేదీలలో భద్రాచలంలో తెలంగాణ గిరిజన గురుకులాల విద్యాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇగ్నైటిఫెస్ట్ లో దమ్మపేట గిరిజన గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఫ్యాన్సీ డ్రెస్ పోటీలో సంతోష్, డి సాత్విక్, స్పాట్ డ్రాయింగ్ పోటీలో బి అఖిల్, తెలుగు హ్యాండ్ రైటింగ్ పోటీలో బి హేమంత్, బెస్ట్ ఆవుట్ వెస్ట్ పోటీలో భి భరత్, యూత్ పార్లమెంట్ పోటీలో పి రామచరణ్, డి విష్ణువర్ధన్ అనే విద్యార్థులు ప్రతిభ కనపరచి మెమొంటోలు, పారితోషికాలు, ప్రశంసాపత్రాలు పొందారు. వీరిని పాఠశాల ప్రిన్స్‌పాల్ బి జాను నాయక్, వైస్ ప్రిన్స్‌పాల్ ఎస్ శ్యామ్‌కుమార్, బి బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు

▸▸ ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు ▸▸ ఆడిపాడిన విద్యార్థులు



అశ్వారావుపేట ఉన్నత పాఠశాలలో

అశ్వారావుపేట/ రూరల్, జనవరి 11: పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి వేడుకలను గురువారం అత్యంత ఆనందోత్సహాల నడుమ నిర్వహించారు. అశ్వారావుపేటలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలతో పాటు మండలంలోని అనేక పాఠశాల్లో వేడుకలను ఘనంగా జరిపారు. పాఠశాలల్లో బొమ్మల కొలువుతో పాటు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో ..

ములకలపల్లి : ములకలపల్లి మండలంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో గురువారం శిశు మందిర్ పాఠశాల ఆవరణలో సంక్రాంతి సందర్బంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు లలిత, లయన్స్ క్లబ్ సెక్రటరీ లయన్ రేపాక ప్రసాదరావు, శిశుమందిర్ పాఠశాల ప్రధానాచార్యులు లయన్ కుంజ జగన్, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబురాలు

మణుగూరు: సంక్రాంతి పండుగ ముందస్తు సంబురాలను వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో పట్టణంలోని కిన్నెర కళ్యాణ మండపంలో బుదవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సతీమణి ప్రమీల పాల్గొని సంబురాల్లో పాలు పంచుకుంది. కార్యక్రమంలో క్లబ్‌ల ప్రతినిధులు కేశా ప్రసాద్, మిట్టపల్లి శ్యాం, నాగరాజు, బొగ్గవరపు అంజలీ, తమ్మిశెట్టి వసుద, పాలవాయి వసుందర, శేషుబాబు, విశ్వనాధగుప్త, బండారు నరసింహారావు, పద్మజ, చిత్తలూరి ఉమ, మాధవి, నారాయణమ్మ, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో..

పట్టణంలోని సుందరయ్యనగర్ బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఇందులో బాగంగా విద్యార్థులకు, తల్లితండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వంహించారు.

పాఠశాలల్లో ముందస్తుగా..

జూలూరుపాడు: సంక్రాంతిని పురస్కరించుకొని మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ముగ్గుల పోటీల కార్యక్రమాన్ని నిర్వహించారు. వినోభానగర్‌లో పోటీలలో గెలుపొందిన చిన్నారులకు సర్పంచ్ పద్మ, కాంప్లెక్స్ హెచ్ఎం లక్ష్మీనర్సయ్య బహుమతులను అందజేశారు.

లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మల కొలువు

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా సీ-టైపు కాలనీలోని ఇల్లెందు క్లబ్‌లో ఏరియా లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బొమ్మల కొలువు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హజరైన కొత్తగూడెం ఏరియా సేవా అధ్యక్షురాలు హరిణీ, ఇల్లెందు ఏరియా సేవా అధ్యక్షురాలు జీ సునిత, మణుగూరు ఏరియా సేవా అధ్యక్షురాలు దుర్గం సుమతి దేవత ప్రతీమలకు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆహుతులను ఆకట్టుకునేలా సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు చేసిన మహిళలకు, యువతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పోరేట్ క్లబ్ సభ్యులు అంజలి, క్లబ్ సభ్యులు బీ కవిత, సునిత, మణి, స్వర్ణ, డీ ప్యాని, ఆరుణ, జీ లక్ష్మీ, శోభ, సరిత, ఏరియా ఇంజనీర్ నర్సిరెడ్డి, ఎస్వోటు జీఎం కృష్ణయ్య, పీఓ పీకేఓసీ లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, ప్రాజెక్ట్ ఇంజనీర్ వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న యువతుల నృత్య ప్రదర్శన

సంక్రాంతి ముగ్గుల సందడి

ఇల్లెందుటౌన్: సంక్రాంతి పర్వదినాన్ని పురష్కరించుకొని ఇల్లెందు పట్టణంలోని పలు పాఠశాలల్లో గురువారం బాలికలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వేడుకల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ తదితరులు పాల్గొని ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కరస్పాడెంట్లు రాంబాబు, రామచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం



మణుగూరులో..



జూలూరుపాడులో..



ఇల్లెందులో విజేతలకు బహుమతుల ప్రదానం

పర్ణశాల రామాలయంలో పీవో పూజలు

దుమ్ముగూడెం జనవరి 11: భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి అనుబంద ఆలయమైన పర్ణశాల రామాలయాన్ని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్ఐ లక్ష్మయ్య, సిబ్బంది లక్ష్మి తదితరులున్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం

కొత్తగూడెం సాంస్కృతికం, ఫిబ్రవరి 11: ధనుర్మాస మహోత్సవాలను పురస్కరించుకుని కొత్తగూడెం విద్యానగర్‌కాలనీలోని శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కూడారై ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వివిధ రకాల ద్రవ్యాలతో పాయసాన్ని తయారు చేసి 108గంగాళాలతో స్వామివారికి నైవేద్యం సమర్పించి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. ఆలయ నిర్వాహకులు పీవి. వర్ధన్‌రావు, కోనేరు పూర్ణచందర్‌రావు, రాంబాబు, వాసిరెడ్డి ప్రసాద్, శ్యాంసుందర్, సిహెచ్. శ్రీనివాస్ రావు, హజరయ్యారు.

మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఎన్నిక

జూలూరుపాడు, జనవరి11: మున్నూరు కాపు సంఘం మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూలూరుపాడులోని ఏవీఆర్ ఫంక్షన్‌హాల్లో గురువారం ఆ సంఘం సమావేశాన్ని గౌరవ అధ్యక్షుడు ముత్తిన్ని రామయ్య అధ్యక్షతన జరిగింది. సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పాపకొల్లుకు చెందిన రాంశెట్టి రాంబాబు, మాచినేనిపేటకు చెందిన మల్లెల నాగేశ్వరరావులను నియమించారు. గౌరవ సలహాదారులుగా బాపట్ల మురళి, రోకటి సురేష్, ఉపధ్యక్షులుగా గోపు రామకృష్ణ, తాటికొండ వెంకటప్రసాద్, సహాయ కార్యదర్శులుగా ఉసికల వెంకటేశ్వర్లు, కోశాధికారిగా నాగేశ్వరరావులను నియమించారు.

బాలల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

● అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు

చుంచుపల్లి, జనవరి 11: బాలల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అడిషనల్ ఎస్పీ విజయ్‌బాబు అన్నారు. గురువారం ఆపరేషన్ స్మైల్ ఎక్స్ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో బాల కార్మికులను, బాలల అక్రమ రవాణాను, నిర్బంధాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా షీటీం ఇంచార్జీ రమాదేవి, చైల్డ్‌లైన్ ప్రొటెక్షన్ అధికారిని హరికుమారి, నోడల్ అధికారి శివకుమారి, జిల్లా ఎహెచ్‌టీయూ ఇంచార్జీ శ్రీనివాసరావు, జిల్లా కార్మికశాఖ అధికారి షర్ఫుద్దీన్, విద్యాశాఖాధికారి అన్నామణి, సిబ్బంది నాగయ్య, మల్లికాంబ, రాంబాబు పాల్గొన్నారు.

కేటీపీఎస్‌ను సందర్శించిన జెన్కో డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ, జనవరి 11: పాల్వంచలోని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని 5,6,7 దశలను జెన్కో డైరెక్టర్ లక్ష్మయ్య గురువారం సందర్శించారు. బాయిలర్ మిల్స్, కోల్‌ప్లాంట్, యూసీబీ తదితర విభాగాలను పరిశీలించారు. అధికారులకు తగు సూచనలందించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5,6 దశల సీఈ ప్రభాకరరావు, 7వదశ సీఈ వెంకటేశ్వరరావు, ఎస్ఈలు, డీఈలు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మేలు చేసినా ప్రజలు చెడు కోరుకున్నారు

● ఆళ్లపల్లి ఎంపీపీ మంజుభార్గవి

ఆళ్లపల్లి, జనవరి 10: ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణలపై గురువారం హైదరాబాద్, ప్రగతిభవన్‌లో మహబూబబాద్ పార్లమెంట్ ఎన్నికల పై జరిగిన సమావేశంలో భద్రాద్రి జిల్లా ఎంపీపీల అధ్యక్షురాలు, ఆళ్లపల్లి ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి ప్రసంగించారు. అధికారుల భవిష్యత్, ప్రజల క్షేమం కోసం బీఆర్ఎస్ మేలు చేసినపట్టికి, వారు చెడు కోరుకోని కాంగ్రెస్‌కు పట్టం కట్టారాని, బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు సేవలందించాలని, అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న కొన్ని శాఖల అధికారుల పనితీరుపై బీఆర్ఎస్ దృష్టిపెట్టడంతో, ప్రభుత్వాన్ని మార్చలన్న లక్ష్యంతో, ఉద్యోగులు ఓటమికి ముఖ్య ప్రాత వహించారన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూడకుండా, కేవలం 6 గ్యారంటీలపై ఓటువేసి, తెలంగాణ ప్రజలు నష్టపోతున్నారని, చేసిన తప్పును భవిష్యత్‌లో తెలుసుకుంటారని ప్రసంగించారు. ఎంపీపీ ప్రసంగం పై మాజీ మంత్రి హరిష్‌రావు, కేటీఆర్, ప్రశంసించారు.

ఉద్యోగుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

మణుగూరుటౌన్, జనవరి 11: మణుగూరు ఏరియాలోని గనులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సింగరేణి ఉద్యోగుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఏరియా డీజీఎం పర్సనల్ సలగల రమేష్ అన్నారు. గురువారం ఏరియా పర్సనల్ విభాగానికి సంబంధించిన సంక్షేమ అధికారులు, పీఓఏలు, అయా విభాగాల మినిస్టీరియల్ ఉద్యోగలతో ఏరియా జీఎం కార్యాలయంలో డీజీఎం పర్సనల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడారు. ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు ప్రక్రియలో ఏర్పడే సంబంధిత సమస్యల పరిష్కారంలో వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ పీఓలు ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన కార్యకర్తలను విస్మరించొద్దు

● వ్యవసాయశాఖామంత్రి తుమ్మల



తుమ్మలను సన్మానిస్తున్న నాయకులు

దమ్మపేట, జనవరి 11: కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసిన కార్యకర్తలను విస్మరించవద్దని వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గండుగులపల్లిలో తుమ్మల నివాసంలో గురువారం భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులను అదికారులు కలిసి తుమ్మలకు అభినందలు తెలిపారు. ఆంధ్రరాష్ట్ర పరిదిలోని ఏలూరు జిల్లాకు చెందిన పలువురు రైతులు తుమ్మలను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం అశ్వారావుపేట, సత్తుపల్లి ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయితో కలసి సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడుతు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేసిన నాయకులను, కార్యకర్తల సేవలను గుర్తించి వారికి ప్రాదాన్యతను ఇవ్వాలని కోరారు. తుమ్మలను కలిసినవారిలో పామాయిల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి రాంచంద్రప్రసాదు, దొడ్డా ప్రసాదు, మట్టా దయానంద్, కొయ్యల అచ్యుతరావు, ఎంపీపి సోయం ప్రసాదు, కేవి సత్యనారాయణ, దొడ్డా సత్యం ఎల్లిన రాఘవరావు, శ్రీరాముల ప్రసాదు, కక్కిరాల రమేష్, దొడ్డా బాస్కరరావు, పోతినేని శ్రీరామ వెంకట్రావు, వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖా అధికారులు కలిసారు.

ఆడపడుచులకు కల్యాణలక్ష్మీ వరం: ఎమ్మెల్యే పాయం

బూర్గంపాడు, జనవరి 11: పేదింటి అడపడుచులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ వరమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలచారి అధ్యక్షతన గురువారం కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని 46మంది లబ్ధిదారులకు చెక్కులను ఆందజేశారు. మోరంపల్లి బంజర గ్రామంలోని జడ్పీఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఎల్ఈడి డిజిటల్ స్క్రీన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగిరెడ్డి, కాంగ్రెస్, టీడీపీ మండల అధ్యక్షులు కృష్ణారెడ్డి, జగదీశ్వరరావు, మాజీ జడ్పీటీసీ విజయ్ గాంధీ, సర్పంచులు స్వప్న, వీరాంజనేయులు, సూరమ్మ, వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ రామకొండారెడ్డి, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఆనంద్, లక్ష్మీనారయణరెడ్డి, వీరారెడ్డి, సుబ్బరామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, కిషోర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గౌడ్‌లను షెడ్యూల్ ట్రైబల్‌గా గుర్తించాలి

కొత్తగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏజెన్సీలో అనాధిగా నివసిస్తున్న గౌడులకు షెడ్యూల్ ట్రైబల్‌గా రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలు ప్రకారం తక్షణమే ప్రభుత్వం షెడ్యూల్ ట్రైబల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఏజెన్సీ గౌడ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నరాటి ప్రసాద్ గురువారం జిల్లా కలెక్టర్ ప్రియాంకని కలిసి వినతిపత్రం అందజేశారు. తెలంగాణ పునర్విభజన చట్టంలో ఏజెన్సీ గౌడు ఎస్టీ అని పేర్కొన్నారు. గత అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యేగా రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఏజెన్సీ గౌడులుగా ఎస్టీలని షెడ్యూల్ ట్రైబల్ సర్టిఫికెట్ ఇవ్వాలని ఆనాటి సీఎం కేసీఆర్‌ను డిమాండ్ చేశారు. నూతన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై స్పందించి షెడ్యూల్ ట్రైబల్ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గౌడ సంఘ జిల్లా నాయకులు కాసుల శ్రీనివాస్, బుర్ర వెంకటేశ్వర్లు, భరద్వాజ్ రాంబాబు, కందుల సుబ్బారావు, రవుల రవి, ముత్యం సాంబయ్య పగలబోయినా శ్రీను, చేనుగొని రమేష్, జి. నాగరాజు, యాసారపు జానయ్య తదితరులు ఉన్నారు.

చైనా మాంజాలను విక్రయిస్తే కఠిన చర్యలు: ఎఫ్ఆర్‌వో

పినపాక, జనవరి 11: గాలి పటాలు, పతంగులను విక్రయించే దుకాణాదారులు చైనా మాంజాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడూళ్లబయ్యారం ఫారెస్ట్ రేంజ్ అధికారిణి తేజశ్వి హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం ఆమె, సిబ్బంది తో కలసి పలు గ్రామాల్లోని దుకాణాల్లో దాడులు నిర్వహించి తనిఖీలు జరిపారు.

సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యమివ్వాలి

జూలూరుపాడు, జనవరి 11: తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో ప్రాధాన్యతను కల్పించాలని కోరుతూ గురువారం జూలూరుపాడులో తహసీల్దార్ శారదకు తెలంగాణ ఉద్యమ కారుల సంఘం, వివిధ పార్టీల ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలతో పాటు, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకూరి రమేష్, ప్రజా పంథా పార్టీ డివిజన్ నాయకులు ఏదులాపురం గోపాలరావు, పార్టీ మండల అధ్యక్షుడు ధర్మా, న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి రమేష్, నాగయ్య పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాలి..

● నీతి అయోగ్‌మిషన్ డైరెక్టర్ రాధ

కొత్తగూడెం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత (యాస్పిరేషనల్) జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరుకు ప్రతిపాదన పంపాలని నీతి అయోగ్‌మిషన్ డైరెక్టర్ వి. రాధ తెలిపారు. గురువారం ఢిల్లీ నుంచి ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ఐడీఓసీ కార్యాలయం నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ యాస్పిరేషన్ డిస్ట్రిక్ బ్లాక్ ప్రోగ్రాం కింద జిల్లాకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేశారని, ఆ నిధుల వినియోగంపై నాలుగు కోట్ల రూపాయలకు ద్రవ్య వినిమయ ధృవీకరణపత్రాలు కూడా పంపడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సుజాతనగర్, జనవరి 11: పంచాయతీ సెక్రటరీలు తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అధికారి మెహినుద్దీన్ ఖాన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 20 పంచాయతీ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో 20 పంచాయతీల సెక్రటరీలు నరేందర్ ప్రసాద్, రవి, విజయ్ భాస్కర్, సుమలత, నర్మద, క్రిష్ణ కుమారి, దివాకర్, ఎండీ ఇజహర్, ప్రసాద్, సతీష్, రహీమ్, రోహిణి, రవి, విజయ్, ఉమ, శ్రీవిద్య, నర్సింహారావు, లక్ష్మీ నర్సయ్య, జమున, రామారావు తదితరులు పాల్గొన్నారు.

లాల్‌బహుదూర్‌శాస్త్రికి ఘన నివాళి

పాల్వంచ టౌన్, జనవరి 11: ప్రధానిగా జై జవాన్.. జై కిసాన్ నినాదంతో దేశ ఔనత్యాన్ని చాటిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రీ అని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శాస్త్రీ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని పాల్వంచమార్కెట్‌లోని శాస్త్రీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. మాజీ జడ్పీటీసీ యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్‌వీఆర్‌కే ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

టేకులపల్లి, జనవరి 11: మండలంలో 36గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం క్రింద చేపట్టిన పనులపై గురువారం ఈజీఎస్ కార్యాలయ ఆవరణలో అడిషనల్ డీఆర్‌డీవో నల్లమోతు రవి ఆధ్వర్యంలో 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మార్చి 2022నుంచి 2023 వరకు చేపట్టిన రూ.6కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులు చేపట్టినట్లుల అధికారులు వెల్లడించారు. పనుల్లో జరిగిన అవకతవకలను వెల్లడించారు. అడిషనల్ డీఆర్‌డీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొంటామన్నారు. పలు పనుల్లో తేడాలు కన్పించడంతో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.16వేలు జరిమానాలతో పాటు రూ.28,577లు రికవరీలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి రమణారావు, ఏపీఎం అనూష, అంబుడ్స్‌మెన్ నాగప్రకాష్, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ సురేష్, ఎంపీడీవోలు వీరబాబు, బాలరాజు, ఎంపీవో గణేష్‌గాంధీ, ఏపీవో కాలంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు, జిల్లా రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పులో లవణాల శాతం కోసమే నమూనాల సేకరణ

సుజాతనగర్, జనవరి 11: ప్రస్తుతం వినియోగిస్తున్న ఉప్పులో లవణాల శాతం తెలుసుకోవడం కోసమే ఈ నమూనాల సేకరణ అని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ బి జానకీరామ్ అన్నారు. గురువారం సుజాతనగర్ పంచాయతీలో ఉప్పు నమూనాలను సేకరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సుజాతనగర్ మండలంలో 5 సబ్ సెంటర్లు, చుంచుపల్లి మండలంలో 7 సబ్ సెంటర్ల నుంచి నమూనాలను సేకరిస్తున్నామన్నారు. నమూనాలను హైదరాబాద్ లాబ్‌లో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. దీనిలో అయోడిన్, సోడియం శాతం ఎంత మొత్తాలలో ఉన్నది ల్యాబ్‌లో పరీక్షించిన తర్వాత తెలుస్తుందని, వీటి నమూనాలు అంగన్‌వాడీ సెంటర్లు, ఆయా కుటుంబాలలో వాడుతున్న ఉప్పును నమూనాగా తీసుకుని పరీక్ష నుంచనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరన్న పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి: కూనంనేని

పాల్వంచ టౌన్, జనవరి 11: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం రాత్రి పాల్వంచ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం సమావేశపు హాలులో ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ బాధ్యులు పలువురు మాట్లాడుతూ తమ తమ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టుల బాధలు తనకు తెలుసునని, తాను మొదటగా కొత్తగూడెం నుంచి జర్నలిస్టుగా పని చేశానని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు వేముల కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే. సుబాని, గౌరవ అధ్యక్షులు ఆర్. సంజీవ్‌కుమార్, గౌరవ సలహాదారు చంద్ర నర్సింహారావు, సీనియర్ జర్నలిస్టులు ఎ. అబ్బురాం, జైనుల్లాబుద్దీన్‌తోపాటు పుల్లారావు, తోట శ్రీనివాసరావు, రామకృష్ణ, వీరభద్రం, బాణోత్ నాగేశ్వరరావు, పి. వెంకట నారాయణ, రజాక్, కే. రాజా, పాషా, నజీరుద్దీన్, ఎస్. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయండి: డీఈవో

చుంచుపల్లి, జనవరి 11: చెకుముఖి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని డీఈవో ఎం. వెంకటేశ్వర చారి అన్నారు. గురువారం ఐడీఓసీలోని కార్యాలయంలో సైన్స్ సంబరాలకు సంబందించి పోస్టర్లను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. జనవిజ్ఞాన వేదిక భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పరీక్షలు రాష్ట్ర సమగ్ర శిక్ష అబియాన్ వారి సహకారంతో నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. ఈ పరీక్షలు నాలుగు స్థాయిల్లో స్కూల్‌స్థాయిల్లో ఈ నెల 19న, మండల స్థాయిలో 27న, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 3న, రాష్ట్రస్థాయిలో ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండి లక్ష్మణ్, రాష్ట్ర జేవీవి ఉపాధ్యక్షురాలు కస్తూరి, రాష్ట్ర కమిటీ మెంబరు ఆర్. వెంకటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, కోశాధికారి ఎం. మోహనరావు, కే. వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ.. ముగ్గురిపై కేసు

పాల్వంచ, జనవరి 11: ఓ స్థల వివాదంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో ముగ్గురి కలసి ఓ వ్యక్తి పై దాడి చేశారు. వారిపై పాల్వంచ రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం దంతెలబోర ఎస్సీ కాలనీకి చెందిన బల్లెం పెద్ద వెంకటేశ్వర్లు సింగరేణిలో పదవీ విరమణ పొంది మణుగూరులో స్థిరపడ్డాడు. బుధవారం తన స్వగ్రామమైన దంతెలబోర ఎస్సీ కాలనీలో తనకున్న స్థలాన్ని పరిశీలించడానికి వచ్చాడు. ఆ స్థలం విషయంలో తన తమ్ముడు చిన్న వెంకటేశ్వర్లుతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే వారిరువురూ పరస్పరం ఎదురుపడి ఘర్షణకు దిగారు. పెద్ద వెంకటేశ్వర్లుపై చిన్న వెంకటేశ్వర్లు తన వద్ద నున్న గొడ్డలితో దాడి చేయగా అతని చేతికి గాయమయ్యింది. పక్కనే ఉన్న చిన్న వెంకటేశ్వర్లు కుమారులు పెద్దవెంకటేశ్వర్లును చంపుతామని బెదిరించారు. దీంతో పెద్ద వెంకటేశ్వర్లు ప్రథమ చికిత్స అనంతరం పాల్వంచ రూరల్ పోలీసులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కాలువలో జారి పడి కూలీ మృతి

పాల్వంచ, జనవరి 11: ఫిట్స్ వ్యాదితో కూలీ మృతి చెందిన సంఘటన పాల్వంచలో గురువారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్‌కు చెందిన సోడే ఐతయ్య(35) స్థానికంగా కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని సంవత్సరాలుగా అతను ఫిట్స్ వ్యాదితో బాదపడుతున్నాడు. బుధవారం సాయంత్రం బహిర్భూమికై కిన్నెరసాని కాలువకు వెళ్లాడు. అక్కడ ఫిట్స్ రావడంతో కాలువలో జారిపడి ఊపిరాడక మృతి చెందాడు. ఉదయం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకసాగారు. ఈ క్రమంలోనే స్థానికులు కిన్నెరసాని కాలువలో ఐతయ్య మృతదేహం పడి ఉందని భార్య మంగమ్మకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా మృతదేహం ఐతయ్యదిగా గుర్తించారు. మృతుడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ హరిబాబు తెలిపారు.

ఆటో డ్రైవర్ల నిరసన

అశ్వాపురం జనవరి 11: మహలక్ష్మి పథకంతో తాము రోడ్డున పడ్డామని ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ఆటోడ్రైవర్లు అశ్వాపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ మాట్లాడుతూ డ్రైవర్లకు జీవనం భారంగా మారిందని,ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు యాదగిరిరెడ్డి, నాగరాజు, రమేష్, రామకృష్ణ, శ్రీను, లింగమల్లు, ఏకాంబ్రం తదితరులు పాల్గొన్నారు.

16న సున్నంబట్టిలో గోపూజ మహోత్సవం

దుమ్ముగూడెం జనవరి 11: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మప్రచార పరిషత్‌ల అద్వర్యంలో ఈనెల 16న సున్నంబట్టి శ్రీ ఆదిశేషావతార వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు టీటీడీ జిల్లా కో-ఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. గురువారం జిల్లా కార్యాలయంలో గోపూజ పోస్టర్లను ఆవిష్కరించారు. ధర్మాచార్య పిలకా నాగేంద్రరెడ్డి, రాణా ప్రతాప్‌శర్మలున్నారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక చేయూత

పాల్వంచ టౌన్, జనవరి 11: పట్టణంలోని 8వ వార్డు రాంనగర్‌కు చెందిన ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి ధనకోటి తిరుమలరావుకు ఆర్థిక చేయూతనందించి బాసటగా నిలిచారు. పట్టణ సీపీఐ కార్యదర్శి, 8వ వార్డు మాజీ కౌన్సిలర్ అడుసుమిల్లి సాయిబాబు విద్యార్థి తల్లి వెంకటలక్ష్మికి రూ.10వేలను గురువారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ విద్యార్థి ఇంజనీరింగ్ పూర్తి అయ్యే వరకు ప్రతి సంవత్సరం తన వంతుగా రూ.10వేలను అందచేస్తానన్నారు. కార్యక్రమంలో అడుసుమిల్లి కారుణ్య, మన్యం వెంకన్న, ఆడెపు పెద్ద వెంకటరామయ్య, శంకర్, పద్మ, లక్ష్మీ, భాను కుమారి పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 11: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో గురువారం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, యూనియన్ నాయకులు మహేష్, మాధవనాయక్, పవన్ కుమార్, ఇనపనూరి నాగేశ్వరరావు, నిర్మల, మొగిలిపాక రవి, అశ్విని, మాధురి, గాయత్రి, రమణ, మానస, జయ, నాగస్వరూప, విజయలక్ష్మి, రమాదేవి, అనూషా, వెంకటేష్, సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 11: సింగరేణిలో పని చేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించే విధంగా ఐఎన్‌టీయూసి కృషి చేస్తుందని కొత్తగూడెం ఏరియా ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు ఆల్బర్ట్ తెలిపారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని వివిధ మైన్స్, డిపార్టుమెంట్ల వద్ద జరిగిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో నూతన ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని, అందు కోసం ఐఎన్‌టీయూసీ సైతం కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రామారావు, నగేష్, రాఘవులు, నాగరాజు, రాజేశ్వరరావు, సుబ్రమణ్యం, అప్పారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సంస్థవృద్ధికి శ్రమించే వారికి పదోన్నతులు కల్పిస్తాం

రుద్రంపూర్, (సింగరేణి) జనవరి 11: సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం శ్రమించే వారికి అర్హతను బట్టి పదోన్నతులు కల్పిస్తామని సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజు తెలిపారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని వివిధ మైన్స్, డిపార్టుమెంట్ల వద్ద పని చేస్తున్న కార్మికులకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను అందచేశారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, రామకృష్ణ, రవీందర్, శివకేశవరావు, ఖరీముల్లా, అనీల్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో నైతిక విజయం ఏఐటీయూసీదే

మణుగూరుటౌన్, జనవరి 11: సింగరేణి సంస్థలో డిసెంబరు 27న జరిగిన గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మణుగూరు ఏరియాలో నైతికంగా గెలుపొందని యూనియన్ ఏఐటీయుసీనేనని గుర్తింపు కార్మికం సంఘం ఏఐటీయుసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని పీకేఓసీ-2, కేసీహెచ్‌పీ, మణుగూరు ఓసీలలో జరిగిన గేట్ మీటింగ్‌లలో ఆయన పాల్గొని మాట్లాడారు.సంస్థలో నూతన గనుల ప్రారంభానికి కృషి చేస్తామని, సంస్థ మనుగడ నూతన గనులతోను ఉందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ఏఐటీయుసీ కట్టుబడి ఉందన్నారు. సింగరేణి ఆదాయాన్ని మొత్తం సీఎండీ బీఆర్ఎస్ ప్రభుత్వానికి దారాదత్తం చేసారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మిర్యాల రంగయ్య, కే రాజ్‌కుమార్, వై రాంగోపాల్, మల్లేల రామనరసయ్య, మేకల ఈశ్వరరావు, జి పుల్లారావు, ఆవుల నాగరాజు, సురేందర్, సుభాని, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేంద్ర రుణాలను సద్వినియోగం చేసుకోండి

అశ్వారావుపేట, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రజలకు అందుతున్న రుణాలు, సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకొని సద్వినియోగం చేసుకోవాలని అశ్వారావుపేట యూనియన్ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్ కోరారు. గురువారం పేరాయిగూడెంలో ఖాతాదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'మా సంకల్పం వికసిత భారతం' పేరుతో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో తిరుమలకుంట బ్రాచి మేనేజర్ మురళీకృష్ణ, ఆర్డీఓలు రాంబాబు, శ్రీధర్, సతీష్, నాగరాజు, ఐకెపీ సిబ్బంది సత్తిబాబు, సుమిత్ర, విఓలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలి: డీపీవో

జూలూరుపాడు, జనవరి 11: ప్రజా పాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేసి త్వరతిగతిన పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రమాకాంత్ సూచించారు. గురువారం ఎంపిడివో కార్యాలయాన్ని ఆయన సందర్శించి ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారన్న వివరాలను ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఎంపీవో తులసీరాంలను అడిగి తెలుసుకున్నారు. 17నాటికి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఇది ఇలా ఉండగా జూలూరుపాడు మండలంలో 11,852 దరఖాస్తులు రాగా ఇప్పటి వరకు 10,865 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. సర్వర్ మొరాయించడంతో ఆన్‌లైన్ ప్రక్రి యను చేపట్టేందుకు ఆపరేటర్లు ఇబ్బందులకు గురయ్యారు.